RNI-TELTEL/2017/72695

9 సెప్టెంబర్ 2023

# శుభ తెలంగాణ

శనివారం | మేడ్చల్

ఎడిటర్: చంద్రశేఖర్

సంపుటి : 6, సంచిక :186

వెల:3 రూ/-

www.subhatelangana.in

Published From Medchal, Circulated at Jagtial, Jangaon, Jayashankar, Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri, Bhuvanagiri.

## ప్రోటోకాల్ ఉల్లంఘనలతో నన్ను కట్టడి చేయలేరు



హైదరాబాద్(శుభ తెలంగాణ): కోర్టు కేసులు, విమర్శలు, ప్రోటోకాల్ ఉల్లంఘనలతో తనను కట్టడి చేయలేరన్నారు తెలంగాణ గవర్నర్ తమిళి సై. గవర్నర్ గా నాలుగేళ్లు పూర్తి చేసుకున్నారు తమిళి సై.. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె.. తెలంగాణకు తొలి మహిళా గవర్నర్ గా పని చేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. గవర్నర్ పదవి ఇచ్చినందుకు ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపారు.

వివరాలు 2లో..

## ఉక్రెయిన్ యుద్ధంపై మోదీ వైఖరి భేష్



హైదరాబాద్(శుభ తెలంగాణ): రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై మోదీ సర్కారు అనుసరిస్తున్న వైఖరిని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సమర్థించారు. ఒకవైపు శాంతి కోసం పాటుపడుతూనే, మరోవైపు దేశ సార్వభౌమాధికారానికీ, ఆర్థిక ప్రయోజనాలకూ ప్రాధాన్యతను ఇవ్వడమే సరైన వైఖరి అని

వివరాలు 2లో..

# దేశంలో వ్యవస్థలపై దాడి

### మైనారిటీలు, దళిత వర్గాలపై దౌర్జన్యాలు
### భారత్‌లో హింస, వివక్ష పెరిగిపోతున్నాయి
### రష్యా-ఉక్రెయిన్ వివాదంలో కేంద్ర ప్రభుత్వ వైఖరితో ఏకీభవిస్తున్నాం: బ్రస్సెల్స్‌లో రాహుల్



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థలపై పూర్తిస్థాయి దాడి జరుగుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. వ్యవస్థలను అణచివేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై యూరోపియన్ యూనియన్(ఈయూ) వర్గాల్లోనూ ఆందోళనలు ఉన్నాయని చెప్పారు. యూరప్ పర్యటనలో భాగంగా బ్రస్సెల్స్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వాస్తవానికి భారత్‌లో మైనారిటీలతో పాటు దళిత, గిరిజన, నిమ్న వర్గాలు కూడా దాడులకు గురవుతున్నాయని, దేశ స్వభావాన్నే మార్చేసే ప్రయత్నం జరుగుతోందని రాహుల్ ఆరోపించారు.

వివరాలు 2లో..

## సాగర్‌లో పీవోపీ విగ్రహాల నిమజ్జనం వద్దు

తాత్కాలిక కొలనుల్లోనే వేయాలి: హైకోర్టు



వివరాలు 2లో..

## 5 వేల 89 పోస్టులతో డీఎస్సీ.. నోటిఫికేషన్ రిలీజ్

### టీచర్ పోస్టులకు దరఖాస్తులు 20 నుంచి అక్టోబరు 21 వరకూ స్వీకరణ

**నవంబరు 21 నుంచి నియామక పరీక్షలు**

**80 మార్కులకు పరీక్ష.. టెట్ వెయిటేజీ 20**

**5,089 పోస్టులకు టీఆర్‌టీ నోటిఫికేషన్**

**1,523 స్పెషల్ టీచర్ల భర్తీ లేనట్లే?**



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** లక్షలాది మంది ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఈ నెల 20వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. నవంబరు 21 నుంచి నియామక పరీక్షలు నిర్వహించనున్నారు. 6,612 ఉద్యోగాలను భర్తీ

వివరాలు 2లో..



## జీడీపీపై దొంగ లెక్కలు!

### వృద్ధిరేటుపై లెక్కలను కేంద్రం దాస్తోంది..
### తొలి త్రైమాసికంలో రేటు 7.8% కానేకాదు
### ప్రముఖ ఆర్థికవేత్త అశోకా మోదీ..
### 'ప్రాజెక్టు సిండికేట్'కు వ్యాసం

హైదరాబాద్(శుభ తెలంగాణ): దేశ ఆర్థికవృద్ధి పరంగా భారత ప్రస్థానం సరిగా లేదా? కేంద్ర ప్రభుత్వం చెబుతోందంతా తప్పుడు లెక్కలేనా? ప్రముఖ ఆర్థికవేత్త, సుప్రసిద్ధ ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయ అధ్యాపకుడు అశోకా మోదీ ఇదే చెబుతున్నారు. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) పరంగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జాతీయ గణాంకాల సంస్థ (ఎన్ఎసవో) 'వాస్తవాలను దాచిపెడుతోంది' అని అశోకా మోదీ స్పష్టం చేశారు. కేవలం ఎంపిక చేసుకున్న డేటానే పరిగణనలోకి తీసుకొని భారత దేశ 'వృద్ధి'గా చూపుతోందని ఆయన దుయ్యబట్టారు. ఈ మేరకు 'ప్రాజెక్టు సిండికేట్' కోసం తాను రాసిన ప్రత్యేక వ్యాసంలో ఆ వివరాలను ఆయన పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24)లోని తొలి త్రైమాసికమైన ఏప్రిల్-జూన్ మధ్య జీడీపీ వృద్ధి రేటు 7.8శాతంగా ఉందని కేంద్రం పేర్కొంది. దీన్నే అశోకా మోదీ తన వ్యాసంలో ప్రస్తావిస్తూ తప్పుబట్టారు. మరిన్ని ప్రధాన గణాంకాలను ఎన్ఎసవో

వివరాలు 2లో..



# డెంగీ టెర్రర్

- హైదరాబాద్‌లో ఆస్పత్రులకు బాధితుల క్యూ..
- ఒక్కొక్క వైద్యుడి వద్దకు రోజూ ఐదారుగురు
- గత 72 రోజుల్లో 1023 మందికి డెంగీ

**హైదరాబాద్(శుభ తెలంగాణ):** హైదరాబాద్‌లో డెంగీ విజృంభిస్తోంది. రోజురోజుకూ కేసులు పెరుగుతున్నాయి. నెలల వయసున్న చిన్నారుల నుంచి వయోవృద్ధుల దాకా డెంగీ బారినపడుతున్నారు. ప్రైవేట్‌లో ఒక్కొక్క వైద్యుడి వద్దకు వచ్చే ఓపీ కేసుల్లో అయిదారు డెంగీ కేసులే ఉంటున్నాయి. ఫీవర్ ఆస్పత్రిలో రోజూ ఐదుగురు అడ్మిట్ అవుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రతి వంద మందిలో పది కేసుల వరకు అనుమానిత కేసులుంటున్నాయని వైద్యులు చెబుతున్నారు. డెంగీ జ్వర బాధితులతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. వర్షాలు పడుతుండటం, పరిసరాల్లో నీరు చేరుతుండటం, కాలనీల్లో సిబ్బంది

వివరాలు 2లో..

# డబుల్ ఇండ్లలో అవకతవకలు జరిగితే ఉద్యోగం నుంచి తీసేస్తం

- డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పథకం దేశంలో ఎక్కడా లేదన్న కేటీఆర్
- హైదరాబాదులో రూ.50 లక్షల విలువైన ఇంటిని ఉచితంగా ఇస్తున్నామని వెల్లడి
- రెండో విడతలో 13,300 ఇళ్లను అందజేస్తున్నామని వివరణ
- ఎక్కడ తప్పు జరిగినా అధికారులదే బాధ్యత అని స్పష్టీకరణ



**హైదరాబాద్(శుభ తెలంగాణ):** డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగితే పూర్తి బాధ్యత అధికారులదేనని మంత్రి కేటీఆర్ అన్నారు. తప్పుచేసిన వారిని ఉద్యోగం నుంచి తీసేసే స్థాయిలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ కార్యక్రమంపై శుక్రవారం సెక్రటేరియెట్?లోని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆఫీస్?లో విస్తృత స్థాయి సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు తలసాని, సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, మల్లారెడ్డి, నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ నెల 21న హైదరాబాద్?లో రెండో విడత డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇండ్ల ఎంపికలో ఎవరి ప్రమేయం లేదని, అత్యంత పారదర్శకంగా పేదలకు మాత్రమే అందిస్తున్నామని

వివరాలు 2లో..

- ఇందుకు క్వాడ్ బలోపేతమే మార్గం.. మోదీ, బైడెన్ సంయుక్త నిర్ణయం
- ఇరు దేశాధినేతల ద్వైపాక్షిక చర్చలు.. పలు రంగాల్లో సహకారానికి నిర్ణయం
- ఉమ్మడి ప్రకటన విడుదల.. వచ్చే ఏడాది ఐఎసఎసకు కలిసికట్టుగా ప్రయాణం
- మానవ సహిత అంతరిక్ష యాత్రకు కసరత్తు.. భారత సైన్యానికి రిమోట్ విమానాలు
- 5జీ, 6జీలపై ఉమ్మడి పరిశోధన.. ఐరాసలో భారత్‌కు శాశ్వత సభ్యత్వానికి మద్దతు



# చైనాకు చెక్ పెడదాం!

### స్వేచ్ఛాయుత, సమ్మిళిత, సుస్థిర ఇండో-పసిఫిక్ కోసం కృషి చేద్దాం

**హైదరాబాద్(శుభ తెలంగాణ):** ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా ఆధిపత్య ప్రదర్శనలను , ఏకపక్ష ధోరణులను కలిసికట్టుగా ఎదుర్కోవాలని భారత్-అమెరికా నిర్ణయించాయి. స్వేచ్ఛాయుత, సమ్మిళిత, సుస్థిర ఇండో-పసిఫిక్ కోసం కలిసి పని చేస్తామని ప్రకటించాయి. దీనికోసం క్వాడ్ (క్వాడ్రిలేటరల్ సెక్యూరిటీ డైలాగ్)ను బలోపేతం చేయాలని తీర్మానించాయి. భారత్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జీ 20 శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొనటానికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ శుక్రవారం ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీలో దిగీదిగగానే ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారిక నివాసానికి బైడెన్ వెళ్లారు. అమెరికా అధ్యక్షుడిని మోదీ సాదరంగా స్వాగతించారు. అనంతరం వారిరువురూ ద్వైపాక్షిక చర్చలలో పాల్గొన్నారు. గంటకుపైగా విద్య, వైద్యం, రక్షణ, అంతరిక్షం, టెక్నాలజీ తదితర రంగాలపై

వివరాలు 2లో..

# డబుల్ ఇండ్లలో అవకతవకలు జరిగితే ఉద్యోగం నుంచి తీసేస్తం

- మొదటి పేజి తరువాయి
చెప్పారు. లబ్ధిదారుల ఎంపికను ప్రభుత్వ అధికారులకే అప్పగించామని, కంప్యూటర్ ఆధారిత డ్రా తీస్తామని వెల్లడించారు. ఈ అంశంలో ఎక్కడా తప్పు జరగకుండా చూసుకోవాలని కలెక్టర్ల సూచించారు.

**రెండో విడతలో 13,300 ఇండ్లు పంపిణీ**

హైదరాబాద్ నగరంలో మొదటి విడతలో 11,700 ఇండ్లను పేదలకు అందించామని, రెండో విడతలో దాదాపు 13,300 ఇండ్లను అందించనున్నట్లు చెప్పారు. సిటీలో నోటరీ ప్రాపర్టీల అంశంలోనూ త్వరలో పూర్తి మార్గదర్శకాలు వస్తాయన్నారు. 58, 59 జీవోల ద్వారా కూడా పెద్ద ఎత్తున ప్రజలకు ఉపశమనం లభించనుందన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న కబ్జాలను తొలగించి, వారికి డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. త్వరలో హైదరాబాద్‌లోనూ గృహలక్ష్మి పథకంను ప్రారంభించనున్నట్లు మంత్రి ప్రకటించారు.

మెడికల్? కాలేజీల ఓపెనింగ్? పండుగలా చేయాలె రాష్ట్రంలో కొత్త మెడికల్? కాలేజీల ప్రారంభోత్సవాన్ని పండుగలా నిర్వహించాలని మంత్రులు, ఎమ్మెల్యేలను మంత్రి కేటీఆర్ ఆదేశించారు. 15న తొమ్మిది (జనగామ, నిర్మల్, కామారెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, వికారాబాద్, ఖమ్మం) జిల్లాల్లో మెడికల్ ?కాలేజీలు ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మంత్రి హరీశ్? రావుతో కలిసి కేటీఆర్? హైదరాబాద్ ?నుంచి ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలతో టెలీ కాన్ఫరెన్స్? నిర్వహించారు.

ఓపెనింగ్ సందర్భంగా జిల్లా కేంద్రాల్లో 20 వేల మందికి తగ్గకుండా భారీ ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. దేశంలోనే అతి ఎక్కువ ఎంబీబీఎస్?సీట్లు ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని మంత్రి హరీశ్?రావు చెప్పారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన ఎంబీబీఎస్? సీట్లలో 43 శాతం తెలంగాణలోనే పెరిగాయని పేర్కొన్నారు.

# డెంగీ టెర్రర్

- మొదటి పేజి తరువాయి
ఫాగింగ్ చేయకపోవడంతో పగటి దోమల బెడద పెరిగిందని ఈ కారణంగానే డెంగీ కేసులు పెరుగుతున్నాయని అంటున్నారు. హైదరాబాద్ వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో గత 72 రోజుల్లో 1023 కేసులు నమోదయ్యాయి. ఈ నెలలో 7వ తేదీ వరకు 84, ఆగస్టులో 711, జూలైలో 228 మందికి డెంగీ వచ్చింది. ప్రధానంగా గోల్కొండ, సనత్‌నగర్ సర్కిల్ నుంచి డెంగీ కేసులు ఎక్కువగా వస్తున్నట్లు సమాచారం. ఫీవర్ ఆస్పత్రిలో ఈనెలలో గడిచిన 8 రోజుల్లో 47 మంది అడ్మిట్ అయ్యారు. ప్రతిరోజు 4-10 కేసుల వర కు ఉంటున్నాయి. రెండుమూడు రోజుల వరకు ఫీవర్ తగ్గకపోవడంతో అనుమానంతో పరీక్షలు చేయించడంతో డెంగీగా నిర్ధారణ అవుతోంది. ఆస్పత్రుల్లో అడ్మి ట్ అవుతున్నవారిలో డెంగీ రోగులు వారంలో ముగ్గు రు, నలుగురు ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

**పగటి దోమతోనే తంటా**

పగటి పూట కుట్టే దోమతోనే డెంగీ వస్తుందని వైద్యులు పేర్కొంటున్నారు. ఎయిర్ కూలర్‌లో ఉండే నీరు, వాష్ బేసిన్, సింక్‌లు, మూతలేని ట్యాంకుల వద్ద ఇంటి పరిసరాల్లో ఎక్కడా దోమలు లేకుండా జాగ్రత్తపడాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో తవ్వి వదిలేసిన గుంతలు, చెత్తాచెదారం ఉంటే జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. డెంగీ రోగిని కుట్టిన దోమ ఆరోగ్యవంతమైన వ్యక్తిని కుడితే అతనికి డెంగీ వచ్చే ప్రమాదముందని చెబుతున్నారు. పగటి దోమ కుట్టిన వారిలో క్లాసిక్ డెంగీ, డెంగీ హెమరేజ్ ఫీవర్, డెంగీ షాక్ సిండ్రోమ్ జబ్బులు వచ్చే ప్రమాదముందని చెప్పారు. వైరల్‌ఫీవర్‌లో ఉండే లక్షణాల ఆధారంగా క్లాసిక్ డెంగీ ఫీవర్‌గా పరిగణిస్తారు. ఇది 5 నుంచి 7 రోజులు ఉంటుంది. సాధారణ చికిత్సలతో దీనిని తగ్గించడానికి అవకాశముంది. హెమరేజ్ డెంగీ ఫీవ ర్ దశలో రక్తంలో పరిమాణం తగ్గిపోవడం, బీపీ పడిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రోగి రక్త నాళం నుంచి ప్లాస్మా బయటకు వెళ్లిపోతుందని, దీనిని ప్లాస్మా లీకేజి సిండ్రోమ్‌గా వ్యవరిస్తామని వైద్యులు పేర్కొన్నారు. ఈ దశలో ప్లేట్‌లేట్స్ విపరీతంగా తగ్గిపోవడం, రోగులకు ఎక్కువగా రక్తస్రావం జరుగుతుందని తెలిపారు. ఈ దశలో రోగిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తారు. ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వడం, ప్లేట్‌లేట్స్, ప్లాస్మా ఎక్కించడం చేస్తామని వైద్యులు తెలిపారు. చికిత్స ద్వారా క్రమంగా ఆరోగ్యం కుదుట పడుతుందన్నారు కాగా షాక్ సిండ్రోమ్ డెంగీ దశ చాలా తీవ్ర దశ. ఈ రోగి ఈ దశకు చేరుకోగానే ఇంటెన్సివ్ చికిత్సతో పాటు ప్లాస్మా ఎక్కించాల్సిన అవసరముంది. ఈ దశలో నీరు ఉపిరితిత్తుల్లోకి చేరే ప్రమాదముందన్నారు. రోగికి కృత్రిమ శ్వాస ఇచ్చి ప్రాణాపాయం నుంచి రక్షించాల్సిన పరిస్థితి ఉంటుంది. కాగా నగరంలో డెంగీ కేసులతో పాటు దగ్గు, వైరల్ పీవర్ బాధితులూ పెరుగుతున్నారు. గొంతునొప్పి, గొంతులో గరగర, మింగలేని సమస్యతో బాధపడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రెగ్యులర్‌గా డ్రైవింగ్ చేసేవారు, ట్రాఫిక్ సిబ్బందిలో 30-35% ఈ సమస్యతో బాధపడుతున్నారు.

**యేటా రూ.15 కోట్లు!**

దోమల నివారణ కోసం గ్రేటర్ పరిధిలో ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.12 కోట్ల నుంచి రూ.15 కోట్ల దాకా వెచ్చిస్తోంది. దోమల నివారణ కోసమే 2500 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రాంతాల వారీగా బృందాలను ఏర్పాటుచేసి ప్రతి వారం యాంటి లార్వల్ ఆపరేషన్ (ఏఎల్ఓ), దోమల తీవ్రత, ఫిర్యాదులు, దోమకారక కేసులు నమోదైన ప్రాంతాల్లో ఫాగింగ్ వంటివి చేయాలి. మూడేళ్ల క్రితం వరకు మెజారిటీ ఏరియాల్లో ప్రతి వారం ఏఎల్‌వో క్రమం తప్పకుండా జరిగేది. ఆ తరువాత పరిస్థితి పూర్తిగా పట్టు తప్పింది.

**డెంగీతో ఇంటర్ విద్యార్థిని మృతి**

**మధిర రూరల్, :** డెంగీ బారిన పడి ఖమ్మం జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థిని మృతిచెందింది. మృతురాలు మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లికి చెందిన తాటికొండ హైమావతి(17). ఆమె ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. వారంరోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న ఆమెను ఐదోతేదీన చికిత్స కోసం విజయవాడలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు డెంగీగా నిర్ధారించారు. అక్కడే చికిత్స పొందుతున్న ఆమె గురువారం రాత్రి పరిస్థితి విషమించడంతో మృతిచెందింది.

**డెంగీ లక్షణాలు...**

**ఫీవర్ 103, 104 డిగ్రీల దాకా ఉండొచ్చు.**
**తీవ్రమైన తలనొప్పి, శరీరపు నొప్పులు**
**కంటి గుడ్డు వెనుక భాగం లాగినట్లు నొప్పి**
**శరీరంలో బోన్ ఫీవర్ ఎఫెక్ట్**
**డెంగీ సోకితే ఈ జాగ్రత్తలు**
**తరుచు రోగి బీపీని పరిశీలిస్తు ఉండాలి**
**100/80 కంటే తక్కువ ఉంటే అప్రమత్తంగా ఉండాలి.**
**బీపీ తగ్గిపోతే మూత్రపిండాలు, కాలేయం పనితీరు మందగిస్తుంది.**
**బీపీతో పాటు రక్తస్రావం అధికంగా ఉంటే వెంటనే ప్లేట్‌లెట్స్ ఎక్కించాలి**
**డెంగీ రోగికి ఎక్కువగా ఫ్యూయిడ్స్ ఇస్తుండాలి.**

# చైనాకు చెక్ పెడదాం!

- మొదటి పేజి తరువాయి
సమగ్రంగా చర్చించారు. వారి చర్చల్లో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అనుసరించాల్సిన వ్యూహం కీలక అంశంగా ముందుకొచ్చింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో, అక్కడి సముద్ర జలాల్లో చైనా సైన్యం బలప్రదర్శనలకు దిగటం, పొరుగు దేశాలకు ఆందోళన కలిగించేలా వ్యవహరించటంపై మోదీ, బైడెన్ మాట్లాడుకున్నారు. భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన క్వాడ్ కూటమి చైనాను నిలువరించటానికి చేస్తున్న ప్రయత్నాలను మరింత బలోపేతం చేయాలని నేతలిద్దరూ నిర్ణయించారు. స్వేచ్ఛాయుత, సమ్మిళిత, సుస్థిర ఇండో-పసిఫిక్ కోసం కలిసి పని చేస్తామని ప్రకటించారు. తద్వారా ఆ ప్రాంతంలో అన్ని దేశాల వాణిజ్యం, రాకపోకలు స్వేచ్ఛగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని భారత్-అమెరికా నిర్ణయించినట్లయ్యింది. వచ్చే ఏడాది భారత్ నిర్వహించనున్న క్వాడ్ నేతల శిఖరాగ్ర సమావేశాలకు బైడెన్‌ను మోదీ ఆహ్వానించారు. ఇండో-పసిఫిక్ ఓషెన్స్ ఇనిషియేటివ్ (ఐపీఓఐ)లో చేరాలన్న అమెరికా నిర్ణయాన్ని మోదీ స్వాగతించారు. మోదీ, బైడెన్ ద్వైపాక్షిక భేటీ అనంతరం ఒక ఉమ్మడి ప్రకటన వెలువడింది. నేతల చర్చలకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను ఈ ప్రకటనలో వెల్లడించారు. ఆ వివరాలు..

ఇరు దేశాల ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య ఉన్నతస్థాయి సంబంధాలను కొనసాగించాలి. తద్వారా భారత్-అమెరికా ప్రజలకు ఉజ్వల భవిష్యత్తును ఇవ్వాలి. స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్‌కు, ప్రపంచ అభివృద్ధికి తోడ్పడాలి. ఆర్థికరంగంలోనేగాక ఇరుదేశాల ప్రజల మధ్య కూడా ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయటం ద్వారా ప్రపంచంలో మంచి మార్పులకు భారత్, అమెరికా చోదకశక్తులుగా పని చేయాలి.

అంతరిక్ష పరిశోధనల రంగంలో పరస్పర సహకారాన్ని కొనసాగించాలి. వచ్చే ఏడాది అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రానికి (ఐఎసఎస్) ఇరు దేశాలు కలిసి వెళ్లే ప్రతిపాదనను మరింత ముందుకు తీసుకెళ్లాలి. ఈ ఏడాది ఆఖరుకు మానవ సహిత అంతరిక్ష యాత్రను కలిసి చేపట్టటంపై కసరత్తును కొనసాగించాలి.

రక్షణ రంగంలో పరస్పర సహకారానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా రోదసి, కృత్రిమ మేధో రంగాలకు భారత్-అమెరికా రక్షణ భాగస్వామ్యాన్ని విస్తరించాలి. భారత సైన్యానికి రిమోట్‌తో నడిపించే నిఘా విమానాలను అందించే ప్రతిపాదనపై అమెరికా పరిశీలన జరుపుతుంది. జీఈ ఎయిరోస్పేస్, హెచ్ఏఎల్ సంయుక్తంగా భారత్‌లో జీఈ ఎఫ్-414 యుద్ధవిమానాల ఇంజిన్ల తయారీని చేపడుతాయి. రక్షణరంగంలో ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవటానికి స్టార్టప్‌లను అభివృద్ధి చేయాలి.

అణుశక్తి రంగంలో పరస్పరం కలిసి పని చేయాలి. భారత్‌లో పునరుత్పాదక ఇంధనాల వినియోగం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలి. దీంట్లో భాగంగా భారత్‌లో పదివేల ఎలక్ట్రిక్ బస్సుల తయారీకి చర్యలు. పునరుత్పాదక వనరుల వినియోగాన్ని ప్రోత్సహించటానికి అమెరికా, భారత్ చెరో 50 కోట్ల డాలర్లతో నిధిని ఏర్పాటు చేస్తాయి. ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేలా డబ్ల్యూటీవో చివరి, ఏడవ వివాద పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

టెక్నాలజీ రంగంలో భారత్ సాధిస్తున్న విజయాల నేపథ్యంలో, కీలకమైన, కొత్తగా ఆవిర్భవిస్తున్న టెక్నాలజీల విషయంలో పరస్పరం సహకరించుకోవాలి. ముఖ్యంగా పరస్పర విలువలను, ప్రజాస్వామ్య సంస్థలను పునాదిగా చేసుకొని 'ఇనిషియేటివ్ ఆన్ క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ' (ఐసెట్)పై దృష్టి పెట్టాలి. ఐసెట్‌పై వచ్చే ఏడాది ప్రారంభంలో సమీక్ష జరపాలి. గ్లోబల్ సెమికండక్టర్ పంపిణీ వ్యవస్థల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలి. టెలికాం రంగంలో 5జీ, 6జీ టెక్నాలజీల అభివృద్ధిపై ఇరుదేశాల కంపెనీలు పరస్పరం సహకరించుకునేలా చర్యలు చేపట్టాలి.

ఇరుదేశాల మధ్య విద్యారంగంలో ఇప్పటికే బలంగా ఉన్న సంబంధాలను మరింత పటిష్ఠపరచాలి. ఐఐటీల మండలి, అమెరికా వర్సిటీల అసోసియేషన్ మధ్య కుదిరిన ఒప్పందం మేరకు భారత్-అమెరికా గ్లోబల్ ఛాలెంజెస్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలి. దీంట్లో అత్యున్నతస్థాయి పరిశోధనలు నిర్వహించాలి.

**అధ్యక్షుడైన తర్వాత భారత్‌కు ఇదే తొలిసారి**

అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టిన తర్వాత బైడెన్ భారతదేశ పర్యటనకు రావటం ఇదే తొలిసారి. 2020లో అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌లో పర్యటించారు. ద్వైపాక్షిక భేటీలో మోదీతోపాటు భారత్ తరఫున విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొనగా, అమెరికా నుంచి బైడెన్‌తోపాటు అమెరికా మంత్రులు జానెట్ యెల్లెన్, ఆంథొని బ్లింకెన్, అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్ పాల్గొన్నారు. రెండురోజుల జీ 20 సమావేశాల సందర్భంగా వివిధ దేశాలతో మోదీ 15 ద్వైపాక్షిక సమావేశాల్ని నిర్వహించనున్నారు. వీటి ద్వారా ఆయా దేశాలతో భారత్‌కున్న సంబంధాలను ఓసారి సమీక్షించుకోవటంతోపాటు, మరింత బలోపేతం చేసే అవకాశం లభిస్తుందని మోదీ ఎక్స్ (ట్విటర్)లో పేర్కొన్నారు.

**ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి మద్దతు**

ప్రపంచ పాలన మరింత ప్రాతినిధ్యంతో కూడుకొని ఉండాలని, మరింత సమ్మిళితంగా ఉండాలని బైడెన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. భద్రతామండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వాన్ని ఇవ్వాలన్న డిమాండ్‌కు అమెరికా మద్దతును పునరుద్ఘాటించారు. 2028-29లో భద్రతా మండలి తాత్కాలిక సభ్యదేశంగా భారత్ అభ్యర్థిత్వాన్ని ఆయన స్వాగతించారు.

# జీడీపీపై దొంగ లెక్కలు!

- మొదటి పేజి తరువాయి
పరిగణనలోకి తీసుకుంటే తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 4.5 శాతానికి మాత్రమే పరిమితం అవుతుందని స్పష్టం చేశారు. జీడీపీ వృద్ధి రేటును లెక్కించే క్రమంలో ఎన్ఎసవో దేశీయ ఆదాయాన్నే పరిగణనలోకి తీసుకొందని, వ్యయాన్ని లెక్కలోకి తీసుకోలేదని అశోకా మోదీ పేర్కొన్నారు. దేశీయంగా ఉత్పత్తి అయిన వస్తుసేవల ద్వారా వచ్చిన రాబడిని ఆదాయ ఖాతా కింద.. వీటిని కొనేందుకు దేశ ప్రజలు, విదేశీయులు వెచ్చించే సొమ్మును వ్యయఖాతా కింద పరిగణిస్తారు. దీన్నే అశోకా మోదీ ప్రధానంగా తన వ్యాసంలో ప్రస్తావిస్తూ.. ఆదాయ ఖాతా, వ్యయ ఖాతా సరి సమానంగా ఉండాలన్నారు. "తమ ఉత్పత్తులను వినియోగదారులు కొన్నప్పుడే కదా ఉత్పత్తిదారులు ఆదాయాన్ని ఆర్జించేది?" అని వ్యాసంలో రాశారు. వస్తుసేవల ఉత్పత్తుల ద్వారా వార్షిక ఆదాయ వృద్ధి తొలి త్రైమాసికం ఏప్రిల్-జూన్ మధ్య 7.8శాతానికి పెరిగిందని, అయితే వ్యయ వృద్ధి మాత్రం 1.4శాతంగానే ఉందన్నారు. ఎన్ఎసవో మాత్రం ఆదాయం తాలూకు గణాంకాలనే పరిగణనలోకి తీసుకుందని అశోకా మోదీ పేర్కొన్నారు. ఇది "అంతర్జాతీయంగా ఉన్న అత్యుత్తమ ప్రమాణాలను ఉల్లంఘించడమే"నని ఆయన అన్నారు. దేశ ప్రజలు ఇబ్బందుల్లో ఉండటం, దేశీయ వస్తుసేవల కొనుగోలు విషయంలో విదేశీయులు పరిమిత ఆసక్తిని ప్రదర్శిస్తున్న నేపథ్యంలో ఆర్థిక వ్యయంపై ఎన్ఎసవో 'వాస్తవాలను దాచిపెడుతోంది' అని ఆయన దుయ్యబట్టారు. అయితే ఆదాయ ఖాతా, వ్యయ ఖాతాకు సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా తేడాలు ఉంటాయని.. ఇందుకు అసంపూర్తి డేటానే కారణం అని అశోకా మోదీ నొక్కి చెప్పారు. ఆదాయ, వ్యయ ఖాతాల పరంగా ఉన్న తేడాలను గుర్తించి.. మొత్తంగా డేటాను పరిగణనలోకి తీసుకున్నప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థపై ఓ అంచనాకు రాగలం అని చెప్పారు. దీన్నే ఆస్ట్రేలియా, జర్మనీ, బ్రిటన్ దేశాలు అనుసరిస్తున్నాయని చెప్పారు. వాస్తవానికి తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 7.8శాతంగా ఉందని కేంద్రం చెప్పడంపై పలువురు ఆర్థికవేత్తలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆర్థికవేత్త అశోకా మోదీ విశ్లేషణ ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా అశోకా మోదీ వాదనపై కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ స్పందించారు. జీడీపీ వృద్ధి కోసం వ్యయాల డేటాను కాకుండా రాబడుల పరమైన డేటానే పరిగణనలోకి తీసుకుని లెక్కించే విధంగా భారత్‌లో సులభమైన డేటా విధానం అమల్లో ఉందని పేర్కొన్నారు.

# ఉక్రెయిన్ యుద్ధంపై మోదీ వైఖరి భేష్

- మొదటి పేజి తరువాయి
ఆయన వ్యాఖ్యానించారు. ఈ విషయంలో భారత్ సరైన దారినే ఎంచుకున్నదన్నారు. శనివారం జీ-20 సదస్సు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఒక కాంగ్రెస్ నేత నుంచి ప్రధాని మోదీకి అనూహ్య మద్దతు లభించడం విశేషం. ఓ ఇంగ్లిష్ దినపత్రికకు శుక్రవారం మన్మోహన్‌సింగ్ ఇంటర్వ్యూ ఇచ్చారు. "ప్రపంచ పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయి. ఈ మార్పులకు అనుగుణంగా తన పాత్రను పెంచుకుంటూ, పరిస్థితులను సానుకూలపరుచుకోవడం అవసరం. ఇటువంటి పాత్రను భారత్ మాత్రమే పోషించగలదు. అందుకు సిద్ధం కావాలి" అని మన్మోహన్ అన్నారు. భారత్ భవితవ్యం పట్ల తనకు ఆందోళన లేదని, పూర్తి ఆశాభావంతో ఉన్నానని తెలిపారు. చంద్రయాన్-3 మిషన్‌ను విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

# సాగర్‌లో పీవోపీ విగ్రహాల నిమజ్జనం వద్దు

హైదరాబాద్, : ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీవోపీ)తో తయారు చేసిన గణేశ్ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయరాదని హైకోర్టు మరోసారి స్పష్టం చేసింది. ఈ విషయమై గత ఏడాది ఇచ్చిన ఉత్తర్వులు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పేర్కొంది. పీవోపీ విగ్రహాలను జీహెచ్ఎంసీ తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కొలనుల్లోనే నిమజ్జనం చేయాలని స్పష్టం చేసింది. పీవోపీ విగ్రహాల తయారీపై నిషేధం ఎత్తేయాలని.. సీపీసీబీ నిబంధనలను కొట్టేయాలని పేర్కొంటూ గణేశ్‌మూర్తి కళాకారుల సంక్షేమ సంఘం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్‌ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ధూల్‌పేట్ వాసులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపకుండా ప్రస్తుత ఉపాధిపై దెబ్బకొట్టడం సరికాదని పేర్కొన్నారు. మరో న్యాయవాది వేణుమాధవ్ వాదనలు వినిపిస్తూ గత ఏడాది హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తూ పీవోపీ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. హుస్సేన్‌సాగర్‌లో పీవోపీ విగ్రహాలను నిమజ్జనం చేయలేదని.. తాత్కాలిక కొలనుల్లో నిమజ్జనం చేశామని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా వ్యవహరించినట్లు ఆధారాలతో సహా పిటిషన్ వేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొంది. తదుపరి విచారణ 25కు వాయిదా పడింది.

# దేశంలో వ్యవస్థలపై దాడి

- మొదటి పేజి తరువాయి
రష్యా-ఉక్రెయిన్ వివాదంపై కేంద్ర ప్రభుత్వ వైఖరితో ప్రతిపక్షాలు ఏకీభవిస్తున్నాయని చెప్పారు. పెద్ద దేశమైన భారత్‌కు ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలు ఉండటం సహజమేనన్నారు. జి-20 సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇవ్వడం మంచి విషయమని, అయితే ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు ఆహ్వానం అందకపోవడం జనాభాలో 60% మందికి ప్రాతినిధ్యం వహించే నాయకుడికి విలువ ఇవ్వని బీజేపీ ప్రభుత్వ ఆలోచనా ధోరణికి అద్దం పడుతోందని రాహుల్ అన్నారు. భారత్‌లో హింస, వివక్ష పెరిగిపోతున్నాయని, దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలపై పూర్తిస్థాయిలో దాడులు జరుగుతున్న విషయం అందరికీ తెలుసని పేర్కొన్నారు. ఈ అంశాలపై యూరోపియన్ పార్లమెంటేరియన్లు కూడా చాలా ఆందోళనగా ఉన్నారని, వారు కూడా తమ వాదనతో ఏకీభవించారని తెలిపారు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, ఈ అంశంలో ఇతరులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కాగా, జి-20 సదస్సు నేపథ్యంలో దేశం పేరు మార్పుపై సామాజిక మాధ్యమాల్లో చర్చ చెలరేగి భయాందోళనలకు దారితీయడం అంతా సమస్యను పక్కదారి పట్టించే ఎత్తుగడని రాహుల్ గాంధీ అన్నారు. అదానీ, 'క్రోనీ కేపిటలిజం' గురించి తాము ఆందోళన వ్యక్తం చేసిన ప్రతిసారీ ఇలాంటి నాటకీయ వివాదాలు తెరపైకి వస్తున్నాయని చెప్పారు. ప్రతిపక్షాల కూటమికి ఇండియా అని పేరు పెట్టడం ప్రధాని మోదీని కలవరపెడుతోందని, అందువల్లే ఆయన దేశం పేరు మార్చాలని భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. బ్రసెల్స్ నుంచి ప్యారిసకు బయల్దేరిన రాహుల్... అక్కడినుంచి వారాంతంలో నెదర్లాండ్స్, నార్వే దేశాలను సందర్శిస్తారు. ఆయా దేశాల్లోని పార్లమెంటేరియన్లతో సమావేశాలతో పాటు ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్, స్థానిక ప్రవాస సంస్థలు నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

# 5 వేల 89 పోస్టులతో డీఎస్సీ.. నోటిఫికేషన్ రిలీజ్

- మొదటి పేజి తరువాయి
చేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం 5,089 పోస్టులకు టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే, 1,523 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచ ర్ పోస్టుల భర్తీకి సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేయలేదు. ఉపాధ్యాయ పోస్టులకు ఈ నెల 20 నుంచి అక్టోబరు 21 వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ఫీజును రూ.1000గా నిర్ణయించారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేయాలి. పోస్టుల భర్తీకి విద్యా శాఖ అధికారుల ఆధ్వర్యంలో రాష్ట్రం యూనిట్‌గా పరీక్ష నిర్వహించనున్నారు. నవంబరు 20-30 మధ్య కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సీబీఆర్‌టీ) పద్ధతిలో దీనిని నిర్వహిస్తారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, సంగారెడ్డి జిల్లాల్లో (మొత్తం 11) పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

**160 ప్రశ్నలు.. ఒక్కోటి అర మార్కు**

ఉపాధ్యాయ నియామక పరీక్షను 80 మార్కులకు నిర్వహించనున్నారు. ఒక్కోటి అర మార్కు చొప్పున 160 ప్రశ్నలతో పరీక్ష ఉంటుంది. టెట్ వెయిటేజీ కింద 20 మార్కులను కేటాయించారు. 100 మార్కులకు అభ్యర్థుల మెరిట్ జాబితా రూపొందించనున్నారు. దీని ఆధారంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ నియామకాలను చేపట్టనుంది. చివరగా.. ఎంపికైన అభ్యర్థుల జాబితాను రాష్ట్రస్థాయిలో పరిశీలిస్తారు. ఒక్కో పోస్టుకు ముగ్గురిని ఎంపిక చేసి ధ్రువపత్రాల తనిఖీ చేపడతారు. ఉద్యోగ నియామకాల్లో 95 శాతం స్థానికతను అమలు చేయనున్నారు. జిల్లాల్లోని పోస్టులకు రోస్టర్ విధానం పాటిస్తారు. కాగా, బీఈడీ పట్టా ఉన్న అభ్యర్థులు సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులకు అనర్హులని, డీఈడీ చేసినవారు మాత్రమే అర్హులని సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును టీచర్ పోస్టుల భర్తీలో పరిగణనలోకి తీసుకోనున్నారు.

**1,523 స్పెషల్ టీచర్ పోస్టులపై అస్పష్టత!**

తాజా నోటిఫికేషన్‌లో స్పెషల్ టీచర్ పోస్టులపై ప్రభుత్వం ఏ ప్రకటన చేయకపోవడంతో అసలు వీటిని భర్తీ చేస్తారా? లేదా? అనే సందేహం నెలకొంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ పోస్టుల్లో కొన్నిటిని పదోన్నతులతో భర్తీ చేయాల్సి ఉంది. వీటిని మినహాయించి, మిగిలిన వాటికి నేరుగా నియామకాలు జరపాల్సి ఉంటుంది. దాంతో ప్రస్తుతం స్పెషల్ టీచర్ పోస్టుల భర్తీని పక్కనపెట్టినట్టు తెలుస్తోంది. పరీక్షల కోసం రెండు నెలల గడువును మాత్రమే ఇవ్వడం పట్ల అభ్యర్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 3 నుంచి 6 నెలల సమయం కావాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేగాక రూ.200 ఉన్న దరఖాస్తు ఫీజును రూ.1000కి పెంచడం పైనా విమర్శలు వస్తున్నాయి.

# ప్రోటోకాల్ ఉల్లంఘనలతో నన్ను కట్టడి చేయలేరు

- మొదటి పేజి తరువాయి
ప్రజల విజయమే తన విజయం అని తమిళి సై అన్నారు. తెలంగాణ ప్రజలకు సేవ చేయడానికే ప్రయత్నించా.. 15 శాతమే చేశా ఇంకా ఎంతో చేయాలన్నారు. తనకు ఎలాంటి కన్నింగ్ మనస్తత్వం లేదన్నారు. స్ట్రాంగ్ పొలిటికల్ ఫ్యామిలీ నుంచి వచ్చానని.. గవర్నర్ గా తనకు కొన్ని పరిమితులున్నాయని చెప్పారు. తాను ఎక్కడున్నా తెలంగాణ బంధం మరిచిపోనని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షకురాలిగా తన విధులను, బాధ్యతలు, ఈ సవాళ్లను అధిగమించానని చెప్పారు. తాను సవాళ్లకు, పంతాలకు భయపడబోనన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా

- రెగ్యులరైజ్ మా హక్కు అంటున్న ఉద్యోగస్తులు



**టేకులపల్లి సెప్టెంబర్ 8 శుభ తెలంగాణ :**తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల పిలుపు మేరకు రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గా జరుగుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట టేకులపల్లి మండలంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులైన సి ఆర్ పి, ఎం ఐ ఎస్, సి సి ఓ, ఐ.ఇ.ఆర్.పి, మెసెంజర్లుఎనిమిదవ రోజు పాల్గొన్నారు ఇందులో సమగ్ర శిక్ష ఉద్యోగులు మాట్లాడుతూ తక్షణమే సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం సమగ్ర శిక్ష ఉద్యోగులందని రెగ్యులర్రై చేసి విద్యా శాఖలో విలీనం చేయాలని కోరుతున్నాం మా మహిళ సోదరీమణులకు 180 రోజులు వేతనంతో కూడిన ప్రసిటి సెలవు కల్పించాలని కోరుతున్నాం ఉద్యోగులందరికీ హెల్త్ కార్డు ఇవ్వాలని కోరుతున్నాం ప్రమాదవశాత్తు మరణించిన సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ 10 లక్షలు ఎక్స్ గ్రేషియో ఇవ్వాలని కోరుతున్నాం మా ఈ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించినీ యెడల ఈనెల 11 వ తారీకు నుండి పూర్తి సమ్మెకు దిగుతామని హెచ్చరిస్తున్నాము

# యువత చూపు బీఆర్ఎస్ వైపు

- ముచ్చటగా మూడోసారి అధికారం బీఆర్ఎస్ పార్టీదే
- ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ




**శుభ తెలంగాణ :**హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని సాయి నగర్ ,యూత్ కాలనీల కి చెందిన కాంగ్రెస్ పార్టీ కి చెందిన 100 మంది నాయకులు,కార్యకర్తలు, యువకులు హఫీజ్పేట్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాలింగ్ గౌతమ్ గౌడ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు జగదీశ్వర్ గౌడ్ , ఉప్పలపాటి శ్రీకాంత్ సమక్షంలో మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారికి బీఆర్ ఎస్ పార్టీ కండువా కప్పి బీఆర్ ఎస్ పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించిన ప్రభుత్వ విప్ ఆరెక పూడి గాంధీ.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆరేకపూడి గాంధీ మాట్లాడుతూ యువత అంతా బీఆర్ఎస్ వైపే ఉంది అని,యువత ఈ రోజు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, మంచి గా చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని, మీకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, కంటికి రెప్పలా చూసుకుంటాను అని ప్రభుత్వ విప్ గాంధీ తెలియచేసారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ప్రతి ఒక్కరు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలోకి చేరడం జరుగుతుంది అని, ప్రతి ఒక్కరూ ఆదరిస్తూ ఆశీర్వాదిస్తున్నారని ఆయన తెలిపారు. సంక్షేమ పథకాలను చూసి ఇతర పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు సైతం తమ వెంట రావడం పార్టీకి శుభసూచకం అన్నారు.ఈ రోజు కాంగ్రెస్ పార్టీ నుండి పెద్ద ఎత్తున యువత, నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, మరియు వారి ఆశీర్వాదం తో, వారి సూచనలు,సలహాలతో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని, శేరిలింగంపల్లి లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఖాళీ అయింది అని ప్రభుత్వ విప్ ఆరేకపూడి గాంధీ తెలియచేశారు.. ప్రతి ఒక్కరు బీఆర్ ఎస్ పార్టీ పటిష్టతకు సైనికుడిగా పనిచేయాలని, బీఆర్ ఎస్ పార్టీని బలోపేతం చేయాలని పేర్కొన్నారు, అందరికి మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రతి ఒక్క కార్యకర్తను కంటికి రెప్పలా చూసుకుంటామని, ప్రతి ఒక్కరం కష్టపడి బంగారు తెలంగాణలో భాగస్వాములం అవుదామని గాంధీ పేర్కొన్నారు. అదేవిదంగా ముఖ్య మంత్రి కెసిఆర్ బంగారు తెలంగాణ నిర్మాణము కోసం ఎంతో కృషి చేస్తున్నారని ,మైనార్టీ ల సంక్షేమానికి కృషి చేస్తున్న దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని, అనేక సంక్షేమ పథకాల తో అలరిస్తున్నారు అని, అందులోభాగంగా కల్యాణ లక్ష్మి /షాదీ ముబారక్ షాదీ ముబారక్ ద్వారా పేదింటి ఆడపిల్లకు 1 ,00 ,116 రూపాయలు ఇవ్వడం జరుగుతుందని , ఆసరా పింఛన్లు ,ఒంటరిమహిళా పింఛన్లు,కెసిఆర్ కిట్,కంటి వెలుగు ,రైతు బంధు ,రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు,మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు వంటి అనేక గొప్పసంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్ దేనని ప్రభుత్వ విప్ గాంధీ తెలియజేసారు. ప్రతి ఒక్కరు సైనికుడిగా పనిచేయాలని, తెరాస పార్టీని బలోపేతం చేయాలని పేర్కొన్నారు, అందరికి మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రతి ఒక్క కార్యకర్తను కంటికి రెప్పలా చూసుకుంటామని, ప్రతి ఒక్కరం కష్టపడి బంగారు తెలంగాణలో భాగస్వాములం అవుదామని ప్రభుత్వ విప్ గాంధీ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మర్రి వేణుగోపాల్ రెడ్డి ,శ్రీనివాస్ మరియు (బీఆర్ఎస్ పార్టీ లో చేరిన ముఖ్య నాయకులు మహమ్మద్ బకర్, సాగర్, ఓమర్ ,మిరాజ్, అక్తర్ ,హాజి,జకీల్, సిరాజ్, సాహిల్,,షకీల్, వాసిం, సతీష్, సలీం, మహమ్మద్, షరీఫ్, ముస్తఫా, శివేందర్, నహీం ,అరుణ్, సలానిక్, మోయిన్, సమీర్, షరీఫ్ మోబిన్, ఇబ్రహీం, అమీర్, కరీం, సలీం, అజార్, ఫయాజ్, జునీత్ ,ఆవేజ్ మరియు తదితరులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగినది.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,వార్డ్ మెంబెర్లు, ఏరియా కమిటీ ప్రతినిధులు,మహిళ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు అభ్యర్థిగా అవకాశం కల్పించాలని దరఖాస్తు చేస్తున్న బోడ పుణ్య

**శుభ తెలంగాణ :**హైదరాబాద్ బీజేపీ స్టేట్ ఆఫీస్ లో ఇల్లందు అసెంబ్లీ కి బీజేపీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గా అవకాశం కల్పించాలని బోడ పుణ్య దరఖాస్తు సమర్పించుకున్నారు.అన్ని మండలాల అధ్యక్షులు, నియోజకవర్గ నాయకుల మద్దతు తో పుణ్య నాయక్ దరఖాస్తు సమర్పించారు.



# 13న ఐటీడీఏ భద్రాచలం ఎదుట టిపిటిఎఫ్ ధర్నా

- టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్



**శుభ తెలంగాణ :** గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల, విద్యార్థుల యొక్క సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 13న భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట జరిగే నిరసన ప్రదర్శనకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని టిపిటిఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ కోరారు. కోయగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల షెడ్యూలను వెంటనే విడుదల చేయాలని,ఉపాధ్యాయులకు కేటాయించబడుతున్న హాస్టల్ అదనపు విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని,రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడనందున సూపర్ న్యూమరరీ పోస్టులన్నింటినీ రెగ్యులర్ పోస్టులుగా మార్చి కన్వర్టెడ్ లేదా అప్ గ్రేడెడ్ ఆశ్రమ పాఠశాలలో సర్దుబాటు చేయాలని,రెగ్యులర్ పోస్టులలో అప్రెంటిస్ ఉపాధ్యాయులుగా నియమించబడిన వారిలో కొందరికి కోర్టు ఉత్తర్వుల ప్రకారం రెగ్యులర్ స్కేలు వర్తింపజేసినట్లుగానే కోర్టు ఉత్తర్వులను తెచ్చుకున్న మరికొందరికి కూడా రెగ్యులర్ స్కేలును వర్తింపజేయాలని, ఏకీకృత సర్వీసు నిబంధనలు రూపొందించి ఉపాధ్యాయులు ఉద్యోగుల సంఖ్య దామాషాను అనుసరించి ఉన్నత స్థాయి డిప్యూటీ డైరెక్టర్,డిటిడిఓ,ఏటిడిఓ,ఏవో పదోన్నతులు కల్పించాలని,జీవో 317 అమలు తర్వాత సూపర్ న్యూమరరీ పోస్టులలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ ఖాళీలలో సర్దుబాటు చేయాలని,జీవో 317 బాధితుల , స్పౌజ్ ల అప్పీల్స్ అన్నింటిని పరిష్కరించాలని,గతంలో పనిచేసిన సిఆర్టిలందరినీ రెన్యువల్ చేయాలని,సిఆర్టిలను రెగ్యులరైజ్ చేయాలని,సిఆర్టిల పిఆర్సి బకాయిల బడ్జెట్ని విడుదల చేయాలని, కేజీబీవీ సిఆర్టిల మాదిరిగా గిరిజన సంక్షేమ శాఖ మహిళా సిఆర్టిలకు కూడా మెటర్నిటీ సెలవులను వర్తింపజేయాలని, గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులందరికీ రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల స్కేల్స్ వర్తింపజేయాలని,గిరిజన సంక్షేమ శాఖలోని విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అందుకని రిజర్వ్ ఫండ్ మంజూరు చేయాలని,అన్ని ఆశ్రమ పాఠశాలలకు ప్యాట్రన్ ప్రకారం ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలని,గిరిజన సంక్షేమ శాఖలో ప్రత్యేక టిఆర్టి నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని,బోధనా సిబ్బందికి సరిపడు రెసిడెన్షియల్ క్వార్టర్లను నిర్మించాలని,అన్ని ఆశ్రమ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా ఉన్నతికరించాలని,ప్రతి గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలకు కనీసం ఇద్దరూ ఉపాధ్యాయులను నియమించాలని,ప్రధానోపాధ్యాయులు మరియు డిప్యూటీ వార్డెన్ల అధికారాలను స్పష్టం చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని,రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గిరిజన సంక్షేమ హాస్టల్ లను ఆశ్రమ పాఠశాలలుగా మార్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కొరకు 13న జరిగే నిరసన ప్రదర్శనలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టిపిటిఎఫ్ మండల కార్యదర్శులు బి.శ్రీనివాస్,ఎం.శారద, ఉపాధ్యాయులు బి.కస్నా నాయక్,సిహెచ్.జానకి,బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పేదవారి సొంత ఇంటి కల నెరవేర్చుకునేందుకు అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు ఎంతో పారదర్శకంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల అర్హుల ఎంపిక



- శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రెండవ దశ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక డ్రా 15 న మరియు ఇండ్ల కేటాయింపు 21 వ తేదీన
- అర్హులైన ప్రతి ఒక్కరికి దశల వారిగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు
- ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవరసం లేదు ,పైసా ఖర్చు లేకుండా అర్హులైన పేదలకు నిష్పక్షపాతంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు
- ప్రతి నెల దశల వారిగా ఇండ్ల కేటాయింపు
- అబ్బుర పరిచే ఆత్మగౌరవ సౌధం.. డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయం
- ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ

**శుభ తెలంగాణ :**హైదరాబాద్ నగరంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమంపై డాక్టర్ %బీ=% అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం లో మంత్రి కేటీఆర్ అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి , మహమూద్ అలీ , మల్లారెడ్డి , ఎమ్మెల్సీలు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ మొదటి దశ లో 11,700 వేల ఇండ్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా పేదలకు అందించాం.ఈనెల 21వ తేదీన రెండవ దశ లో దాదాపు మరో 13,300 ఇండ్లను మరోసారి అందించనున్నం. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఎంతో పారదర్శకంగా ఎంపికైన అర్హులైన లబ్దిదారులకు పైసా ఖర్చు లేకుండా ఉచితంగా అందచేయడం జరుగుతుంది అని, ఈ నెల 15 న రెండవ దశ ఇండ్ల కేటాయింపు డ్రా తీయబడునని, 21 వ తేదీన ఇండ్ల కేటాయింపు జరుగునని, నిష్పక్షపాతం గా ,ఎంతో పారదర్శకంగా,పార్టీలకతీతంగా కేటాయింపు జరుగునని, ఎవరికి డబ్బులు ఇవ్వకూడదు అని, డబుల్ బెడ్ రూమ్ లు , మరియు గృహ లక్ష్మీ, చేతి వృత్తులకు, మైనారిటీ లకు ఆర్థిక సహాయం ను చేయడం జరుగుతుంది అని, పేదలు ఎవరు అధైర్య పడవద్దు అని ,ప్రతి ఒక్కరికి దశల వారిగా ఇండ్ల కేటాయింపు జరుగునని ప్రభుత్వ విప్ గాంధీ తెలియచేసారు , ఆత్మ గౌరవ ప్రతీక అని , ముఖ్యమంత్రి కేసీఆర్ మానస పుత్రిక డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకమని , పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి చేపట్టిన బృహత్తర పథకమే డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకమని తెలిపారు.ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మానస పుత్రిక పథకాలలో ఒకటి అయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం అని అన్నారు. పేదలకు ఉచితంగా ఇండ్లు ఇవ్వాలనే ఉద్దేశంతో చేపట్టి పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చాలి, ఆత్మగౌరవంతో గొప్పగా జీవించాలనే ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆలోచనల మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీరు వంటి అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించినట్టు తెలియచేసారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు దశల వారిగా అందచేయడం జరుగుతుంది అని ,లాటరీ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు అందచేయడం జరుగుతుంది అని ప్రభుత్వ విప్ గాంధీ తెలియచేశారు. అర్హులైన నిజమైన లబ్ధిదారుల ఎంపిక నిష్పక్షపాతంగా ,పారదర్శకంగా ఉండేలా చూసి నిజమైన లబ్ధిదారులకు అవకాశం కలిపించి ఇండ్లు కెటయించేలా చేయడం జరిగినది అని, అర్హులైన లబ్ధిదారులకు అందచేస్తామని, ప్రభుత్వ విప్ గాంధీ తెలియచేశారు. మిగిలిన వారికి విడతల వారిగా కేటాయించడం జరుగుతుందని తెలిపారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో ఎవరి జోక్యం లేకుండా పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. పేదవారు ఆత్మ గౌరవంతో బ్రతకాలనే ఉద్దేశ్యంతో ఇళ్ళు కట్టించడం జరిగిందని మానవ ప్రయత్నంతో లాటరీ ద్వారా కేటాయింపు చేసే ప్రక్రియ కన్నా ఇది ఎన్నో రేట్లు నాణ్యత, పారదర్శకత, జవాబుదారీతనాన్ని సూచిస్తుందని ఈ ప్రక్రియ ఇండియాలో మొదటి సారిగా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది ప్రభుత్వ విప్ గాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు మరియు ఇతర అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# బావి భారత పౌరులకు మార్గ నిర్దేశకులు గురువులు

డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్

**మేడ్చల్ /కాప్రా సెప్టెంబర్ 8 (శుభ తెలంగాణ)** భవిష్యత్ తరాలను సమున్నంతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న పాత్ర చాలా గొప్పదని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు శుక్రవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీచర్స్ డే సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల సంపూర్ణ అభివృద్ధి మేధస్సు పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా గొప్పదని ఆయన తెలిపారు ప్రతి ఒక్కరి జీవితంలో ఒక్కరైనా ఆత్మీయ గురువు ఉంటారని అలాంటి గురువులకు మనస్ఫూర్తిగా పూజించడం మన బాధ్యత అని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గొడుగు వేణు ముదిరాజ్ ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



# శిక్షణ పొందిన వారికి ఉద్యోగం కల్పిచడమే లక్ష్యం..



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 08 శుభ తెలంగాణ :**ఎల్బీనగర్ నియోజకవర్గం త్రిఫోలిఎక్స్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్పొరేట్ ఆఫీస్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్ లు హాజరై ప్రారంభించారు. కార్పొరేట్ ఆఫీస్ నిర్వాహకులు మహాదేవుని సంతోష్ కుమార్ సంపత్ కుమార్ కోటగిరి ఉషారాణి వారిని అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మల్టీలెవెల్ కంపెనీలను ప్రోత్సహిస్తుంది. టీంవర్క్ తో ఇంజనీరింగ్, అగ్రికల్చర్ విద్యార్థులకు కోచింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించడమే మాలక్ష్యం అని అన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నందివనపర్తి లో అట్టాహసంగా సామూహిక వరలక్ష్మి వ్రతం

- అమ్మవారి నామస్మరణతో మార్మోగిన ఆలయం
- అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ



**ఇబ్రహీంపట్నం,సెప్టెంబర్8 శుభ తెలంగాణ** :యాచారం మండలంలోని నంది వనపర్తి గ్రామంలో శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయంలో శ్రావణ మాస చివరి శుక్రవారం రోజున జ్ఞానసరస్వతి సేవాసమితి మాతృమండలి సభ్యుల పర్యవేక్షణలో నందినాథ క్షేత్ర పరిధిలోని సుమారు 80 మంది మహిళలతో సామూహిక వరలక్ష్మి వ్రతం న కార్యక్రమం నిర్వహించారు. జ్ఞాన సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి ఆలయ అర్చకులు అత్యంత వైభవంగా శ్రావణ వరలక్ష్మి వ్రతం కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.దేవాలయంలో జరిగిన విశేష కార్యక్రమాలు సామూహిక వరలక్ష్మి వ్రతం, కుంకుమార్చణ,లలితా సహస్ర నామ పారాయణం, అమ్మవారికి ఒడి బియ్యం ,అఖండ హారతి లు ఘనంగా జరిగాయని జ్ఞానసరస్వతి దేవాలయ వ్యవస్థ గురించి ఆలయ ఫౌండర్ సదా వెంకట్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ సదావెంకట్ ,సమన్వయ మండలి సభ్యులు రాఘవేందర్ శర్మ, శివ కుమార్, నిఖిల్, కొండూరు అంజయ్య , మాతృమండలి సభ్యులు రుద్రమ్మ, దీపికా రాణి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

శుభ తెలంగాణ
TELTEL/2017/72695
ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక
శనివారం | మేడ్చల్
9 సెప్టెంబర్ 2023
www.subhatelangana.in


# సామాజిక న్యాయాన్ని బొంద పెడుతున్న రాజకీయ పార్టీల భరతం పట్టాలి

- బిసి సింహ గర్జన గోడ పత్రిక ఆవిష్కరణ
- బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి మునుకుంట్ల సత్యనారాయణ



**చౌటుప్పల్. సెప్టెంబర్ 8. శుభ తెలంగాణ :.**ఈ రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని బొందపెడుతున్నటువంటి రాజకీయ పార్టీల భరతం పట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి మునుకుంట్ల సత్యనారాయణ అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో ఈ నెల 10న హైదరాబాద్లో జరిగే బీసీల సింహగర్జనను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి మునుకుంట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం గోడపత్రిక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక న్యాయం సబండ వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఈనెల 10వ తారీకున హైదరాబాదులో జరిగే బీసీ సింహ గర్జనకు బీసీలు అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అరశాతం, ఐదు శాతం లేని కులాలకు రాజకీయ టికెట్లను కేటాయిస్తూ తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయాన్ని బొందపెడుతున్నటువంటి రాజకీయ పార్టీల భరతం పట్టాలని పిలుపునిచ్చారు. ఓట్లు బీసీలవి అధికారం, పదవులు అగ్రకులాలకు కేటాయిస్తూ రాజకీయ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా పార్టీలో ఉన్నటువంటి బీసీ నాయకులు రాజకీయ పార్టీలను ప్రశ్నించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అన్నారు. ఈ రాష్ట్రంలో ఎవరి జనాభా దామాషా ప్రకారం వారికి సీట్లు కేటాయించే విధంగా అన్ని రాజకీయ పార్టీలపై ఒత్తిడి తీసుకురావడానికి బీసీల ఏ జెండాగా 2023 ఎన్నికలు నిర్వహించే విధంగా పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు బండి గారి శ్రీధర్ గౌడ్, బీసీ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వీరమల్ల కార్తీక్ గౌడ్, నాయకులు బొంగు జంగయ్య గౌడ్ ,బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు ఆదిమూలం శంకర్, బిసి యువజన సంఘం మండల అధ్యక్షులు ముప్పిడి కృష్ణ, ఆర్.ఎం.పి డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు పసుల యాదయ్య గౌడ్, బొంగులింగస్వామి, శిలువేరు సైదులు, కేతరాజు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలి

- పంజాల రామాంజనేయులు గౌడ్
- రైతులకు సకాలంలో యూరియా అందించాలి



**వలిగొండ సెప్టెంబర్ 8 శుభ తెలంగాణ :**రైతులకు యూరియా ఎంతగానో అవసరం యూరియా కొరత కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు కొరత లేకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు యాదాద్రి భువనగిరి జిల్లాలో మీడియా సమావేశం నిర్వహించారు కాంగ్రెస్ పార్టీ నాయకులు టిపిసిసి ప్రధాన కార్యదర్శి ప్రమోద్ కుమార్, వలిగొండ జడ్పిటిసి పద్మ అనంతరెడ్డి, పొట్టోళ్ల శ్యామ్ గౌడ్ ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సభ్యులు పంజాల రామాంజనేయులు గౌడ్ పాల్గొని మాట్లాడుతూ రైతులకు అవసరం ఉన్న సమయంలోనే యూరియా కొరత చేయడం అధిక ధరలకు అమ్ముకోవడం ప్రభుత్వం చేసే రాజకీయంలో ఒకటని ఇకనైనా రైతులు గ్రహించాలని రైతులకు సంక్షేమం కోసం రైతు సమన్వయ కేంద్రాలను కమిటీలను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఈ సమయంలో ఎందుకు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంలేదని ప్రశ్నించారు ఇకనైనా యూరియా కొరత లేకుండా చూడాలని అన్నారు రైతుల కోసం కాంగ్రెస్ పార్టీ అండగా ఉండి పోరాటం చేస్తుందని తెలిపారు

# గుంతలకు మరమ్మతు చేయూస్తున్న ఎస్సై రమణారెడ్డి.

ప్రమాదాల నివారణకు చొరవ చూపిస్తున్న ఎస్ఐ.



**టేకులపల్లి సెప్టెంబర్ 8 న్యూస్ ఇండియా:** ప్రధాన రహదారిపై ప్రమాదాలు జరగకుండా నివారణ లో భాగంగా వెంకట్యాతండ వద్ద గుంతలకు మరమ్మత్తు కార్యక్రమాలు చేయించిన టేకులపల్లి ఎస్సై గన్ రెడ్డి రమణారెడ్డి . టేకులపల్లి మండలం బేతంపూడి గ్రామపంచాయతీ పరిధి వెంకట్యతండా సమీపాన రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఎస్సై రమణారెడ్డి తన సొంత ఖర్చుతో రోడ్డుపై ఉన్న గుంతలకు మరమ్మత్తు పనులు చేయించారు. ప్రయాణికుల అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రమాదాల నివారణకు తన వంతు కృషిచేసిన ఎస్ఐ ని పలువురు అభినందించారు.

# నూతన కారం మిల్లు ప్రారంభించిన ఎంపిపి జడ్పిటిసి



**శుభ తెలంగాణ :**అడ్డగూడూర్ మండలం ధర్మారం గ్రామంలో డిఆర్డీఏ%డ% సెర్ఫ్ గారి ఆర్థిక సహకారం 4,00,000 లక్షల వ్యయంతో స్వరూప కు లోన్ కింద మంజూరు అయినా ఉప్పలమ్మా తల్లి కారం మిల్లును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఎంపీపీ దర్శనల అంజయ్య, జడ్పిటిసి శ్రీరాముల జ్యోతి అయోధ్య, పొన్నాల వెంకటేశ్వర్లు పిఏసీఎస్ చైర్మన్ అడ్డగూడూర్, చిప్పలపెల్లి మహేంద్ర నాథ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, పూలపెల్లి జనార్దన్ రెడ్డి మాజీ ఎంపీటీసీ అడ్డగూడూర్, ఎంపిడిఓ చంద్రమౌళి, ఎంపిఓ ప్రేమలత, ఎపియం వెంకటేశ్వర్లు, యాదగిరి,పంచాయతీ కార్యదర్శి అనిత ధర్మారం సర్పంచ్ శీలం జ్యోతి దావీద్,ఉప సర్పంచ్ మేకల సుజాత జగన్, మానాయికుంట మాజీ సర్పంచ్ కడారి సైదులు,
బాలెంల అరవింద్ బిఆర్ఎస్వి తుంగతుర్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి, పయ్యావుల రమేష్ బిఆర్ఎస్వి అడ్డగూడూర్ మండల అధ్యక్షుడు,గూడెపు నరేష్ అడ్డగూడూర్ పట్టణ అధ్యక్షుడు, బిఆర్ఎస్ పార్టీ మండల యువ నాయకులు బాలెంల నరేందర్, లాదినేని వెంకన్న,ధర్మారం మాజీ గ్రామశాఖ అధ్యక్షుడు తాడోజు లక్ష్మణాచారి బిఆర్ఎస్వి మండల నాయకులు మేకల ప్రవీణ్,ప్రశాంత్,ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై పోరాటం చేతకాక ,పోరాడేవారిపై భౌతిక దాడులా..?

- SFI -జిల్లా అధ్యక్షులు బుర్రు అనిల్ కుమార్
- ఏబీవీపీ దిష్టిబొమ్మ దగ్ధం



**వలిగొండ సెప్టెంబర్ 8 శుభ తెలంగాణ :**వలిగొండ మండల కేంద్రంలో ఎస్.ఎఫ్.ఐ. తెలంగాణా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా స్థానిక వలిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేయడం చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ. జిల్లా అధ్యక్షులు బుర్రు అనిల్ కుమార్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నేటి నుండి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు జరుగుతున్నాయి. విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ ఎదుగుదల ఓర్వలేని మతోన్మాద ఎబివిపి ఈ సమావేశాలు అడ్డుకునేందుకు పక్కా ప్రణాళికతో కర్రలతో, రాళ్ళతో దాడి చేశారు. ప్లీనరీ ఏర్పాట్లులలో జెండాలు,బ్యానర్స్ కడుతుంటే కావాలని గొడవ సృష్టించి రాళ్ళతో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ పై దాడి చేశారు. రమేష్ తో పాటు జిల్లా నాయకత్వం పై తీవ్రంగా దాడిచేశారు.సామాన్య ప్రజలను సైతం బెంబేలెత్తించారు,పార్క్ చేసిన ఆటోను సైతం ధ్వంసం చేశారు. రమేష్ పై రాళ్ళతో దాడి చేసి తలపగలగొట్టారు. విద్యార్థి సంఘం పేరుతో ఎబివిపి ఆరాచకాలు సృష్టిస్తుంది. విద్యార్థి సమస్యలపై చేతనైతే పోరాడాలి, కానీ పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ పై దాడి చేసి ఎదుగుదలను అడ్డుకోవాలని అనుకుంటే చరిత్రలో ఎం జరిగిందో ఎబివిపి తెలుసుకోవాలి. సమాజంలోప్రజలకోసం పని చేసే వారిని తయారు చేయాలి ,కానీ ఆరాచకలు సృష్టించేవారిని కాదు. ఎబివిపి ఎస్ఎఫ్ఐ నాయకులపై చేసిన ఈ దాడిని ప్రజాస్వామిక వాదులు, మేధావులు, అభ్యుదయ శక్తులు ఖండించాలని అన్నారు.ఆరాచకం సృష్టిస్తున్న ఎబివిపి గుండాలను శిక్షించాలని కోరుతునాము. తెలంగాణ రాష్ట్రంలో తమ అస్థిత్వం కాపాడుకోవడం కోసం ఎబివిపి ఇలాంటి దాడులు చేస్తోంది అని అన్నారు.
ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వేముల నాగరాజు,మండల ఉపాధ్యక్షులు వేముల జ్యోతిబాస్,బాలు,వంశీ,శిరీష,నవ్య,కావ్య,తదితరులు పాల్గొన్నారు

# మృతుడి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం...

- ఆర్థిక సహాయం అందజేసిన ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు దూడల కనకయ్య గౌడ్...



**న్యూస్ ఇండియా తెలుగు, సెప్టెంబర్ 09 (బచ్చన్నపేట మండల రిపోర్టర్ జేరిపోతుల రమేష్)**జనగాం జిల్లా బచ్చన్నపేట మండలంలోని ఇటికాలపల్లి గ్రామానికి చెందిన కోలుగూరి ఆగమల్లయ్య (70) గురువారం రోజున అనారోగ్యంతో మృతి చెందాడు.విషయం తెలుసుకున్న ఎంపిటిసి ఫోరం అధ్యక్షులు దూడల కనకయ్య గౌడ్ వారి కుటుంబాన్ని పరామర్శించి, అంత్యక్రియలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో జేరిపోతుల అంజయ్య, కోలుగూరి రాములు, కోలుగూరి వెంకటయ్య, జేరిపోతుల రాజు, కోలుగూరి రాములు,కోలుగూరి చంద్రయ్య, జేరిపోతుల నర్సయ్య, కోలుగూరి సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు..

# ప్రగతినగర్ లోని రామరాజ్ కాటన్ షోరూం ని ప్రారంభించిన ఎమ్మెల్యే కె పి వివేకానంద్...



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 8 శుభ తెలంగాణ :**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రగతినగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన రామరాజ్ కాటన్ షోరూం ఎమ్మెల్యే కె పి వివేకానంద్ ముఖ్యఅథితిదిగా మేయర్ కోలన్ నీల గోపాల్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అద్యేక్షులు రంగరాయా ప్రసాద్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# మరణించిన కుటుంబానికి అండగా బిజెపి నాయకులు



**ఇబ్రహీంపట్నం,సెప్టెంబర్8 శుభ తెలంగాణ :**ఇంటి పెద్ద దిక్కున కూలిపోయి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేద కుటుంబానికి బిజెపి నాయకులు అండగా నిలిచారు. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామానికి చెందిన బంగారిగళ్ల యాదయ్య ఇటీవల అనారోగ్య కారణాలవల్ల మృతి చెందగా ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ 121 బూత్ అధ్యక్షులు పండల హరిశంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదిభట్ల మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు శిగ వీరస్వామి గౌడ్ బంగారిగళ్ల యాదయ్య కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం అందజేసి వారి కుటుంబ సభ్యులని పరామర్శించారు. పేదలకు బిజెపి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గీత సెల్ కన్వీనర్ పండల లక్ష్మీపతి గౌడ్, రామగళ్ళ శ్రీనివాస్, లింగాల మహేందర్, గోదాసు కేశవులు ముదిరాజ్, ఉడుతల బాలశివుడు గౌడ్,పండల చంద్రాయుడు గౌడ్, దేవరపల్లి గణేష్ గౌడ్, కంశెట్టి యాదయ్య, నీళ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా సురక్ష సేవా సంఘం తెలంగాణ అధ్యక్షులు కిక్కర గోపి శంకర్ యాదవ్..



**అబ్దుల్లాపూర్మెట్, సెప్టెంబర్ 08 శుభ తెలంగాణ :**సమాజసేవనే మార్గంగా ఎంచుకొని ముందుకు సాగుతున్న సురక్ష సేవా సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల నుండి చూపులేని వృద్ధులకు కంటి ఆపరేషన్లు ఇప్పటి వరకు 100 చేపించినట్లు సురక్ష సేవా సంఘం అధ్యక్షులు కిక్కర గోపి శంకర్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురువారం రోజు 32 మందికి కంటి ఆపరేషన్లు చేయించి వారి ఇండ్లలో దింపడం జరిగిందని అన్నారు. శరీరంలో ఏ అవయవం పనిచేసిన పని చేయకున్నా కంటిచూపు కోల్పోతే లోకమంతా చీకటే.. దీనితోపాటు ఒంటరి వృద్ధుల బాధలు ఊహించుకోలేము.. వీటినన్నిటిని దృష్టిలో ఉంచుకొని వారికి ఆసరాగా నిలబడాలని సురక్ష సేవా సంఘం తెలంగాణ, శ్రీ ధనలక్ష్మి ఆప్టికల్స్ సంయుక్తంగా వృద్ధులకు విజయవంతంగా కంటి ఆపరేషన్లను చేపించి, క్షేమంగా వారి ఇండ్లకు తరలించము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపి శంకర్ యాదవ్, శ్రీ ధనలక్ష్మి ఆప్టికల్స్ ఆప్టోమెట్రిస్ట్ జి. రాజేష్ గౌడ్, ఈసీ మెంబర్ అచిని మహేష్, సలహాదారులు నాగవల్లి యాదగిరి, సభ్యులు యాకోబ్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

# విదేశీ పర్యటన దిగ్విజయంగా పూర్తిచేసుకున్నమంత్రి కేటిఆర్ ని కలిసిన ఎమ్మెల్యే కె పి వివేకానంద్...

కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే కె పి వివేకానంద్...

**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్8శుభ తెలంగాణ :** వేలకోట్ల పెట్టుబడులను తెలంగాణకు ఆకర్షించి దిగ్విజయంగా విదేశీ పర్యటనను పూర్తి చేసుకున్న ఐ.టీ మరియు పురపాలక శాఖ మంత్రి వర్యులు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని ఎమ్మెల్యే కె పి వివేకానంద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు, అనంతరం ముఖ్యమంత్రి కెసిఆర్ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినందుకు గాను నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.



# మృతుని కుటుంబానికి చేయూతనందించిన అర్ధ వెంకట్ రెడ్డి



**చౌటుప్పల్. సెప్టెంబర్ 8. శుభ తెలంగాణ :** చౌటుప్పల్ మండలం చిన్న కొండూరు గ్రామానికి చెందిన దోర్నాల బిక్షపతి కుమారుడు రవితేజ ఇటీవల అకాల మరణం చెందడం కారణంగా అల్లాపురం వాస్తవ్యులు చౌటుప్పల్ మండలం బీజేపీ నాయకులు అర్ధ వెంకట్ రెడ్డి మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి వారి కుటుంబానికి రెండు క్వింటాళ్ల బియ్యం శుక్రవారం అందజేశారు. సహాయం చేసిన అర్ధ వెంక రెడ్డిని పలువురు అభినందించి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్న కొండూరు గ్రామ సర్పంచ్ బక్క స్వప్న శ్రీనాథ్, బూత్ అధ్యక్షులు ఎరుకల స్వామి గౌడ్, బక్క యాదయ్య , బాతరాజు సైదులు, చింతపల్లి వినయ్ రెడ్డి, ఉయ్యాల వంశీ, గ్రామస్తులు దేపా అంజిరెడ్డి, బక్క రాములు, బండ్ల సత్తయ్య, మహేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ పోచారం ..



**శుభ తెలంగాణ :**కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని పోచారం గ్రామంలో తెలంగాణ అసెంబ్లీ శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తన స్వగ్రామం బాన్సువాడ గ్రామీణ మండలం పోచారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాలయంలో జరుగుతున్న సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహ స్థిర ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు జరిగిన పూజ, యజ్ఞంలో సతీమణి పోచారం పుష్ప గారితో కలిసి పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి గారు.
పోచారం కుటుంబ సభ్యులు పోచారం శంభురెడ్డి- ప్రేమల, పరిగె వెంకట్ రాంరెడ్డి- అరుణ, గ్రామ సర్పంచ్ పరిగె సాయిరెడ్డి- రాధ దంపతులు కూడా యజ్ఞంలో పాల్గొన్నారు. ఉదయం ప్రారంభమైన పూజలలో మొదటగా గోపూజ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, వేద స్వస్తి, పుణ్యావచనం, గణపతి పూజ, నవగ్రహ పూజ లతో అంకురార్పణ జరిపి అగ్నిప్రతిష్టాపనతో హెూమం ప్రారంభించారు.సాయంకాలం శోడచ ఉపచార పూజ, మంగళహారతి, ఆశిర్వచనం జరిగింది. గ్రామస్తులు, భక్తులు, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులు అందరికీ పోచారం కుటుంబ సభ్యుల ఆద్వర్యంలో తీర్ధ ప్రసాదాలు అందించడంతో పాటుగా అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

# నూతన గృహప్రవేశానికి వెళ్లిన జిల్లా జడ్పీ కో ఆప్షన్.



**గూడూరు మహబూబాబాద్ శుభ తెలంగాణ :**మహబూబాబాద్ జిల్లా జడ్పీ కో ఆప్షన్ ఎండి ఖాసిం గూడూరు మండల కేంద్రంలోని మూడవ వార్డ్ మెంబర్ వాంకుడోత్.కొమ్మాలు గృహప్రవేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా కోఆప్షన్ ఎండి ఖాసిం చేరుకొని ఇరువురి దంపతులను ఆశీర్వదించి గృహ ప్రవేశ మహెూత్సవంలో దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. దినదిన అభివృద్ధి చెందుతూ ప్రజలకు మేలు చేయాలని ప్రజల ఆశీర్వాదం కూడా మీకు ఉండాలని కాసిం అన్నారు కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు వాంకుడోత్ కటార్ సింగ్ మండల కో ఆప్షన్ ఎండి రహీం, నవీన్, బోడ ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.

# సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయటం ద్వారానే పీడిత ప్రజల విముక్తి- చిట్టిపాటి వెంకటేశ్వర్లు

**శుభ తెలంగాణ :** మహబూబాబాద్ జిల్లా బయ్యారం:..నేడు ప్రపంచంలో పెట్టుబడిదారీ శక్తులు రాజ్యమేలుతున్నాయని, ప్రపంచ ప్రజలందరినీ మూకుమ్మడిగా వీరు దోపిడీ చేస్తున్నారని, పెట్టుబడిదారీ సామ్రాజ్య వారద శక్తులను ఓడించకుండా పీడిత ప్రజల విముక్తి సాధ్యం కాదని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు అన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు శుక్రవారం బయ్యారం పార్టీ కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ క్లాసులలో జాతీయ అంతర్జాతీయ పరిణామాలు అనే అంశాన్ని చిట్టిపాటి వెంకటేశ్వర్లు బోధించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని వెనుకబడిన దేశాల అధినేతలను నయానా భయానా ప్రసన్నం చేసుకున్న సామ్రాజ్యవాద శక్తులు ఆయా దేశాల్లోని ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తూ వారిని నిలువు దోపిడీ చేస్తున్నాయని ఆయన అన్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ వ్యవస్థకు పెద్దన్నలాగా వ్యవహరిస్తూ తమకు సహకరించని దేశాలపై దాడులు చేస్తున్నదని ఆయన అన్నారు.
భారతదేశంలోని దళారీ పాలకులు సామ్రాజ్యవాదులతోటి కుమ్మక్కయ్యారని డబ్ల్యూటీవో ఒప్పందంపై సంతకం చేసి సామ్రాజ్యవాదుల దోపిడీకి గేట్లు బార్లా తెరిచారని ఆయన విమర్శించారు. సామ్రాజ్యవాద అనుకూల విధానాలతో భారత పాలకులు కార్మిక, కర్షక తదితర పీడిత వర్గాలను అణచివేత, దోపిడీలకు గురిచేస్తున్నారని ఆయన అన్నారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలు కార్మిక చట్టాల రద్దు అటవీ సంరక్షణ చట్టం విద్యుత్తు బిల్లు లాంటివన్నీ కూడా ప్రజా వ్యతిరేక సంపన్న వర్గాల అనుకూల చట్టాలేనని అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ మనువాద ఎజెండాను అమలు చేస్తున్నదని, అన్ని వ్యవస్థలను మనువాద శక్తులతో నింపుతున్నారని ఆయన విమర్శించారు. మైనార్టీలపై దాడులు కొనసాగిస్తూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజాన్ని అమలు చేయపూనుకుంటున్నారని ఆయన అన్నారు.వామపక్ష లౌకిక శక్తులపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తూ అనేకమందిని హత్య చేయడం,జైళ్లలో నిర్బందించటం లాంటి చర్యలకు పూనుకొంటున్నారని అన్నారు. దేశంలోని బడా బూర్జువా, భూస్వామ్య శక్తులు ప్రపంచ పెట్టుబడీదారులతో కుమ్మక్కయ్యారని,కార్మిక కర్షక ఐక్యతతో వీరిని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈక్లాసులకు పార్టీ జిల్లా నాయకులు మోకాళ్ళ మురళీకృష్ణ, జడ సత్యనారాయణ, ఊకె పద్మ అద్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య,నాయకులు బూర్క వెంకటయ్య,ఆగబోయిన నర్సక్క,గుజ్జు దేవేందర్, శివారపు శ్రీధర్, యస్కే మదార్ సనప పొమ్మయ్య, గుజ్జు క్రిష్ణవేణి,తుడుం వీరభద్రం, బోనగిరి మధు,నేతకాని రాకేశ్, రామగిరి బిక్షం తదితరులు పాల్గొన్నారు.




# తొర్రూరు లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**సెప్టెంబర్ 8 తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :**చాత్తాద శ్రీవైష్ణవ సంఘం పాలకుర్తి నియోజకవర్గం ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి శ్రీమాన్ తిరునగరి శ్రీనివాస స్వామి గారి గృహంలో గోకులాష్టమి ఉత్సవము కన్నుల పండుగగా జరిగింది. వచ్చిన బంధువులందరి గోత్రనామాలతో సంకల్పం చెప్పించి, ఆరాధన, అష్టోత్తరం, సేవా కాలం, మరియు ధూప దీప నైవేద్యాలు, మంగళా శాసనం, శాత్తుమురై కార్యక్రమం చేసి, అందరి చేత శ్రీకృష్ణ పెరుమాళ్ తిరునక్షత్ర తనియ మరియు శ్రీకృష్ణాష్టకం చెప్పించడం జరిగింది. తదుపరి మాణిక్కంకట్టి పాశురాలతో కృష్ణుని వూంజల్ సేవ ఘనంగా నిర్వహించనైనది.తదనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేయడం జరిగింది. అనంతరం కృష్ణాష్టమి పర్వదినాన్ని ఉద్దేశించి తిరునగరి శ్రీనివాస స్వామి గారు మాట్లాడుతూ,
సృష్టికర్త అయిన శ్రీమహా విష్ణువు బ్రహ్మాండాన్ని ఉద్ధరించడానికి శ్రీ కృష్ణుడిగా ఎనిమిదవ అవతారమున జన్మించిన కృష్ణ జన్మాష్టమిని "కృష్ణాష్టమి"మరియు"గోకులాష్టమి" అని పిలుస్తారని, భూమి మీద అధర్మం, అరాచకత్వం పెరిగిపోయి ధర్మం కానరానప్పుడు విష్ణుమూర్తి మానవ అవతారంలో జన్మించి అసుర సంహారం జరిపించి తిరిగి ధర్మాన్ని నెలకొల్పుతాడని, ధర్మాన్ని నిలబెట్టడానికి, మానవాళిని సంరక్షించడానికి.. విష్ణుమూర్తి ఎత్తిన ఎనిమిదో అవతారమే శ్రీకృష్ణ అవతారమని తెలిపారు.
అతను ఉపదేశించిన భగవద్గీత మానవ జీవన విధానానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అందుకే కృష్ణుని జన్మదినం అంటే యావత్ ప్రజానీకం ఎంతో ఘనంగా నిర్వహించుకుంటామని కొనియాడారు. చిరంజీవులు మనస్విని,నందు, దేవాన్ష్,రిషికేష్ మరియు శ్రీవత్సవ వేసిన గోపిక మరియు శ్రీకృష్ణుని వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
ఇట్టి కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ అధ్యక్షులు కురికాల కమలాకర స్వామి,ప్రధాన కార్యదర్శి తిరునగరి శ్రీనివాస స్వామి , ఉపాధ్యక్షులు శ్రీ పేరంబుదూరు సంపత్ కుమార్ , మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీమతి కల్లెడ రజిత , కోశాధికారి తిరుక్కోవల్లూరు సందీప్ , సహాయ కార్యదర్శి రఘు వెంకట చక్రధర్ , సాంప్రదాయ కార్యదర్శి తోమాల శ్రీనివాస స్వామి , గౌరవ అధ్యక్షులు తిరునగరి విద్యాసాగర్ , పరాంకుశం నరసింహ స్వామి, మహ-బాద్ జిల్లా సహాయ కార్యదర్శి తిరునహరి ఉమా మనోహర్ స్వామి,శ్రీమతి రేణుక, తిరునగరి వెంకట కిష్టయ్య , కల్లెడ వెంకటేశ్వర స్వామి , తిరునగరి నరేష్ , కేశవమఠం దుర్గా వరప్రసాద్ , శ్రీమతి మంజుల , తిరునగరి వేణు , శ్రీమతి తిరునగరి శిరీష, దేవాంష్, తిరుక్కోవల్లూరు నరసింహస్వామి, శ్రీమతి సరోజ, శ్రీమతి తిరునగరి కళావతి, తిరనగరి మానస, తిరునగరి మౌనిశ, శ్రీ పేరంబుదూరు వనజ, తపస్వి, పరాంకుశం వసంత, తిరునగరి కవిత, మనస్విని, నందు, తదితరులు పాల్గొన్నారు. తిరునగరి శ్రీనివాస స్వామి గారు వచ్చిన బంధువులందరికీ కృతజ్ఞతలు తెలపడంతో ఈ కార్యక్రమాన్ని పరిసమాప్తం చేయడం జరిగింది.

# అమ్మవారి ఆశీస్సులు ప్రజల పై ఎల్లవేళలా ఉండాలి - గజ్జల యోగానంద్



**శుభ తెలంగాణ :**దీప్తిశ్రీ నగర్, శేరిలింగంపల్లి
గజ్జల యోగానంద్ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు
వర లక్ష్మి వ్రతం లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు
శ్రావణ శుక్రవారం సందర్భంగా శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎంఎల్ఏ గజ్జల యోగానంద్ ఆధ్వర్యంలో దీప్తి శ్రీ నగర్ లోని ధర్మపురి క్షేత్రం లో శుక్రవారం శ్రీ వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని సుప్రభాతం సహస్రనామార్చన, అష్టోత్తర శత నామావళి నిర్వహించారు. వ్రతంలో యోగానంద్ దంపతులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ లోకంలో స్త్రీలు అష్ట ఐశ్వర్యాలనూ, పుత్రపౌత్రాదులనూ పొందేందుకు వీలుగా ఏదైనా ఓ వ్రతాన్ని సూచించమని పార్వతీదేవి ఆది దేవుణ్ని కోరుకున్నపుడు శంకరుడు వరలక్ష్మీ వ్రతాన్ని వరించడం జరిగిందని, ఇంత గొప్ప వ్రతం మన పూర్వికులు ఆచరించి అనాదిగా మనకు అందస్తున్నారని, ఈ నేపథ్యంలో ప్రతి ఆడపడుచు ఆ అమ్మవారి ఆశీస్సులు పొందాలనే గొప్ప సంకల్పంతో ఇలా సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని వ్రతం ఆచరించారు, అనంతరం యోగానంద్ దంపతులు మహిళలకు తీర్థప్రసాదాలు, తాంబూలం మరియు వస్త్రాలు అందచేశారు.

# అనుమతి లేకుండా ధర్నాలు రాస్తారోకోలు, సభలు, ర్యాలీలు చేస్తే కఠిన చర్యలు:సిఐ పాలకుర్తి విశ్వేశ్వర్

**శుభ తెలంగాణ :**
వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు గాని ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు, ర్యాలీలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పాలకుర్తి సిఐ విశ్వేశ్వర్ గారు ఒక ప్రకటన లో తెలిపారు.సామాన్యమైన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, ప్రజాశాంతికి, జనజీవనానికి ఆటంకం కలిగించరాదని, ప్రజలతో పాటు , వాహనదారులను ఇబ్బందులకు గురిచేసే విధంగా చట్ట వ్యతిరేకంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఆకస్మికంగా ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు, సభలు, ర్యాలీలు నిర్వహించే మరియు పాల్గొన్న వ్యక్తులపై చట్ట పరంగా కేసులను నమోదు చేసి తగు చర్యలు తీసుకోనబడుతాయి.
ఏదైనా పైన తెలిపినటువంటి కార్యక్రమాలు నిర్వహించాలంటే ముందస్తుగా దరఖాస్తులు చేసుకొని సంబంధిత రెవెన్యూ మరియు పోలీసు అధికారుల నుండి అనుమతులు పొంది వారు తలపెట్టిన కార్యక్రమాలను నిర్వహించుకోవచ్చు. అదేవిధంగా ధర్నాలు నిరసనలు రాస్తారోకోలు ర్యాలీలు చేసే వారు ముందస్తుగా పర్మిషన్ తీసుకోవడమే కాకుండా తలపెట్టిన కార్యానికి సంబంధించి పూర్తి సమాచారాన్ని పొందు పరచవలసి ఉంటుంది అట్టి కార్యక్రమానికి సంబంధించి సౌండ్ సిస్టం (డిజే) లేదా బాణాసంచా కాల్చడానికి కూడా అనుమతులు తప్పనిసరి. అలా కాకుండా ఎవరైనా డీజే మ్యూజిక్ లేదా లౌడ్ స్పీకర్లు వాడినట్లయితే అవి ఏర్పాటుచేసిన సంబంధిత యాజమాన్యంపై కూడా కేసు నమోదు చేసి వాటిని సీజ్ చేయడం జరుగుతుంది.ఈ నిబంధనలను ఎవరు ఉల్లంఘించిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.ఈ మా పోలీసువారి విజ్ఞప్తిని అన్ని రాజకీయ పార్టీలు మరియు ఇతర సంఘాలు పాటిస్తారని కోరుకుంటున్నాం.




# విదేశీ పర్యటన దిగ్విజయంగా పూర్తిచేసుకున్న మంత్రి కేటిఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ.



**శుభ తెలంగాణ :**రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన శుభసందర్భంగా ఈ రోజు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంత్రి,బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి ప్రత్యేక కృత్షతలు తెలియచేసిన ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ ఈ మేరకు విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన మంత్రి కేటీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేసారు. వేలకోట్ల పెట్టుబడులను తెలంగాణకు ఆకర్షించి దిగ్విజయంగా విదేశీ పర్యటనను పూర్తి చేసుకున్న మంత్రి , బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని ఈరోజు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు, అనంతరం ముఖ్యమంత్రి కెసిఆర్ శేరిలింగంపల్లి నియోజక వర్గ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించినందుకు గాను నా తరుపున, నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై విశ్వాసంతో మూడో సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించటం అత్యంత సంతోషకరమని, ప్రజల సంపూర్ణ అండదండలతో హ్యాట్రిక్ సాధించి సీఎం కేసీఆర్ కి కానుకగా ఇస్తానని ప్రభుత్వ విప్ గాంధీ మంత్రి కేటీఆర్తో అన్నారు. అఖండ మెజార్టీతో తిరిగి రావాలని మంత్రి కేటీఆర్ ఆకాంక్షించారు.

# ఎర్రబెల్లి దయాకర్ రావు నీ పతనాన్ని ఆ భగవంతుడే నిర్ణయించాడు

**పాలకుర్తి నియోజకవర్గ నాయకులు ఝాన్సీ రెడ్డి**

**సెప్టెంబర్ 8 తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ :**పాలకుర్తి మండలం వల్మిడి గ్రామంలో ఇటీవల ఎంతో అంగ రంగ వైభవంగా సుమారు 60 కోట్ల రూపాయల తో నిర్మించిన సీత రామ చంద్ర స్వామి ఆలయానీ టిపిసిసి నాయకురాలు, పాలకుర్తి నియోజకవర్గం ముద్దుబిడ్డ హనుమండ్ల ఝాన్సీ రెడ్డి గారు సందర్శించారు కేవలం రాజకీయ లబ్ధి కోసం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, నాణ్యతలేని కట్టడాలు నిర్మించడం మూలంగా ఆలయ ప్రారంభోత్సవం రోజు ద్వాజ స్తంభం విరిగిపోవడం అరిష్టంగా ప్రజలు భావిస్తున్నారు ఆగ మేఘాల మీద నిర్మించిన దేవాలయం కేవలం రాజకీయ లబ్ధి కోసం, దేవుడి పేరుతో తన ఖజానా నింపుకోవడానికి చేసిన పని తప్పితే, దేవ భక్తితో చేసింది కాదని వారన్నారు 50 కోట్ల రూపాయల పనులు ఇక్కడ ఏం జరగలేదని, కేవలం రాబోయే ఎన్నికల దృష్ట్యా దేవుడి పేరుతో ఓట్లు రాబట్టుకునే పనిలో భాగంగానే ఈ ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగిందని, ఎర్రబెల్లి దయాకర్ చేసిన అవినీతి, అక్రమాలు కారణంలను ఆ భగవంతుడు కూడా సహించలేదు ఎర్రబెల్లి దయాకర్ గారికి ఓటమిని ఆ భగవంతుడే నిర్ణయించాడని వారన్నారు.



శుభ తెలంగాణ
TELTEL/2017/72695
ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక
శనివారం | మేడ్చల్
9 సెప్టెంబర్ 2023
www.subhatelangana.in



# విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

● తొర్రూరు ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య



సెప్టెంబర్ 8 తొర్రూర్ డివిజన్ శుభ తెలంగాణ : ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని,విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తొర్రూరు ఎంపీపీ చిన్న అంజయ్య అన్నారు. మండలంలోని పెద్ద మంగ్యా తండా గ్రామ పంచాయతీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్థానిక సర్పంచ్ జాటోత్ శారద రమేష్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రీడా వస్తువులు, ఫ్యాడ్లు,పెన్నులను ఎంపీడీవో సింగారపు కుమార్ తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అంజయ్య మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వంలోనే ప్రభుత్వ పాఠశాలలో అన్ని విధాలుగా అభివృద్ధి జరిగి నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుండి విద్య పట్ల శ్రద్ధ వహించి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని అన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సహకారంతో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు.విద్యార్థులకు విద్య,క్రీడా సామాగ్రిని పంపిణీ చేసిన సర్పంచ్ శారదా రమేష్ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఏఈ యుగేందర్, పిఏసిఎస్ డైరెక్టర్ జాటోత్ టికు నాయక్, బిఆర్ఎస్ నాయకులు బత్తుల యాకయ్య,పంచాయతీ కార్యదర్శి నీరజ, ఉపసర్పంచ్ తుకారాం,పార్టీ గ్రామ అధ్యక్షుడు లచ్చిరాం,పాఠశాల హెచ్ఎం మాలతి, అంగన్వాడి టీచర్లు శాంతి, సుజాత, స్థానికులు కిషన్,నారాయణ, బుంద, మోహన్ తదితరులు పాల్గొన్నారు


# మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తా.

● మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) జిల్లా అధ్యక్షులు వేర్పుల మహేందర్.



శుభ తెలంగాణ :మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు అనుబంధం) జిల్లా అధ్యక్షులు వేర్పుల మహేందర్ అన్నారు. శుక్రవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మహేందర్ మాట్లాడుతూ గత 13 సంవత్సరాల నుండి మున్సిపల్ కార్మికులుగా విధులు నిర్వహిస్తూ కార్మికుల సమస్యలపై స్పందిస్తున్న నాపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చినందుకు మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా అంకితభావంతో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పగలనకా రాత్రనకా కృషి చేస్తానని అన్నారు. వృత్తిపరంగా ఎవరికి ఎలాంటి సమస్య వచ్చిన నాకు తెలియజేస్తే ఆ సమస్య పరిష్కరించే దిశగా కృషి చేస్తానని మున్సిపల్ కార్మికులకు సూచించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియమించడానికి సహకరించిన సంఘం జిల్లా బాధ్యులకు కార్మికులకు జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కల్యాణ లక్ష్మి /షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన 100 మంది లబ్ధిదారులకు 1,00,11,600/- ఒక కోటి పదకొండు వేల ఆరువందల రూపాయల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు అందచేసిన ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ




శుభ తెలంగాణ :శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హాఫీజ్పేట్, చందానగర్,భారతి నగర్ (పార్ట్) డివిజన్ల పరిధిలోని పలువురికి కల్యాణ లక్ష్మి /షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన 100 మంది లబ్ధిదారులకు 1,00,11,600/- ఒక కోటి పదకొండు వేల ఆరువందల రూపాయల ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపేణా మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో కార్పొరేటర్లు జగదీశ్వర్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి లబ్ధిదారులకు చెక్కుల ను అందచేసిన ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ.
ఈ సందర్బంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ ఈ రోజు వంద మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్కులు అందచేయడం చాలా సంతోషకరమైన విషయం అని ప్రభుత్వ విప్ గాంధీ తెలియచేసారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్ గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురికి కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ పథకం కింద చెక్కులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తూ సంక్షేమ ప్రభుత్వంగా పేరుగాంచిందని, సంక్షేమ పథకాలకు ఏ లోటూ రాకుండా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ పేదలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందంటే సీఎం కేసీఆర్ పనితీరుకు నిదర్శనం అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ గాంధీ కోరారు.
ఈ కార్యక్రమంలో %=×% శ్రీనివాస్ , మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,వార్డ్ మెంబెర్లు, ఏరియా కమిటీ ప్రతినిధులు,మహిళ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పల్లెకు బిజెపి ఇంటింటికి హుస్సేన్ నాయక్.

● గత పాలకుల పై విరుచుకుపడ్డ హుస్సేన్ నాయక్.
● ప్రమాదంగా మారిన లో లెవెల్ వంతెన





గూడూరు మహబూబాబాద్ శుభ తెలంగాణ :ఊరు రా తిరిగి ప్రజల్లోకి బిజెపి ప్రభుత్వం ఏం చేస్తున్నది బిజెపి వల్ల ప్రజలకు ఏమి ఉపయోగాలు ఉన్నాయి రాబోయే కాలంలో బిజెపి వస్తున్నదని ఇంటింటికి ఊరూరా బిజెపి లో రాష్ట్ర మోర్చా అధ్యక్షులు జాటోత్ హుస్సేన్ నాయక్ వివరించారు. ప్రతి తండాలను తిరుగుతూ ఇంటింటికి వెళ్లి నవ్వుతూ పలకరించి ఆప్యాయత అనురాగం తో దగ్గరికి తీసుకొని బిజెపి యొక్క ముఖ్య ఉద్దేశం, బిజెపి పాలనలో ప్రజలు సురక్షితంగా ఉన్నారని బి ఆర్ఎస్ కాంగ్రెస్ వంటెద్దు పోకడలు పోవడమే తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని అది మీరందరూ గుర్తించాలని ఆయన ప్రజా ఆశీర్వాద యాత్ర కార్యక్రమంలో మాట్లాడారు.
లిలో లెవెల్ వంతెనను చూసి షాక్ అయినా హుస్సేన్ నాయక్.
గత పాలకవర్గం పాలించిన రోజులలో వంతెన ఎలా కట్టారో ఈ లో లెవెల్ వంతెన కూలిపోయే స్థితికి రావడంతో చూసి షాక్ అయినా హుస్సేన్ నాయక్ తండావాసులకు గత పాలకవర్గం ఏ విధంగా రోడ్డును వేయాలి అని మాట్లాడుతూ ప్రజలకు కావలసిన వంతెనలు రోడ్లు నాసిరకంగానే ఉన్నాయని ప్రజల గోడును గత పాలకులు పట్టించుకోకుండా వారి ఇష్టానుసారం రోడ్లు , వేసి వంతెనలు కట్టి కాంట్రాక్టులతో చేతులు కలిపారని, గూడూరు మండలం కోబల్ తండా గ్రామపంచాయతీ లోని మూడు గుడిసెల లైన్ తండాకు వెళ్లే దారి మధ్యలో లో లెవెల్ వంతెన ను గత పాలకులు నిర్మించారు. అయితే వంతెన కాలక్రమమైన కూలిపోతూ బీటలు బారి,వచ్చిన అకాల వర్షాలకు తట్టుకోలేక వంతెన రెండు చీలికలుగా పగిలిపోయినది వంతెనను ఇలా నిర్మిస్తారా రోడ్డు ఉన్నది ఒక ఎత్తు లో లెవెల్ వంతెన కట్టింది మరో ఎత్తు రోడ్డుకు సమానంగా కట్టాల్సిన లో లెవెల్ వంతెనను ఇంత దరిద్రంగా కట్టడం గత పాలకుల ఇష్టానుసారమైంది అధికారులు కూడా ఈ లో లెవెల్ వంతెనను పట్టించుకోవడం లేదని కాలక్రమమైన కూలిపోయే దశకు చేరుకున్నదని బిజెపి రాష్ట్ర మోర్చా అధ్యక్షులు జాటోత్ హుస్సేన్ నాయక్ గత పాలకుల పై మండిపడ్డారు. ఈ పర్యటనలో మండల అధ్యక్షులు మోతిలాల్, జిల్లా అధ్యక్షులు రాంబాబు ,జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్, మెరుగు మల్లయ్య చీకటి శ్రీను, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని జయప్రదం చేయండి.



రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పున్నం సారయ్య.

శుభ తెలంగాణ :తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరనారి చిట్యాల (చాకలి) ఐలమ్మ 38వ వర్ధంతి సభలను గ్రామ గ్రామాన వాడవాడనా నిర్వహించి జయప్రదం చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పున్నం సారయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక తొర్రూరు డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో అమరవీరుల యాదిలో సెప్టెంబర్ 10 నుండి 26 వరకు సభలు సమావేశాలు ర్యాలీలు నిర్వహించాలని కరపత్రాన్ని తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పున్నం సారయ్య, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు నల్లూరి రామలింగ%శీ% లు హాజరై మాట్లాడుతూ అమరవీరుల వ్యాధిలో వీరనారి చిట్యాల ఐలమ్మ విద్యుత్ ఉద్యమంలో అసువులు బాసిన సత్తెనపల్లి రామకృష్ణ లను స్మరించుకుంటూ గ్రామ గ్రామాన సభలు సమావేశాలు ర్యాలీలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని అన్నారు. ఇటీవల రజక వృత్తిదారుల సంఘం నిర్వహించిన ఆందోళన పోరాటాల ఫలితంగా లాండ్రీ ఇస్త్రీ షాపుల దుకాణాలకు బొగ్గును ప్రత్యేకంగా ఉచిత విద్యుత్ అందించే విధంగా చట్టాలను సాధించుకున్నామని అన్నారు. రాష్ట్రంలో 250 యూనిట్ల ద్వారా సుమారు 75 వేల మంది లబ్ధి పొందుతున్నారని, మరికొంతమంది అర్హులైన రజక వృత్తిదారులందరికీ ఉచిత విద్యుత్ అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థలలో రజక వృత్తిదారుల పరిణి రజక సొసైటీలకు ఇస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 102 విడుదల చేసిందని దానిని పూర్తిస్థాయిలో అమలు చేసి రజకవృత్తిదారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి వెంకటేష్, తొర్రూరు మండల అధ్యక్షుడు నిమ్మల సోమయ్య, కార్యదర్శి పొడగంటి శేఖర్, సహాయ కార్యదర్శి చింతల మధు, నాయకులు కొండ్రాతి రామకృష్ణ, మడిపెద్ది కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మన్ననలు పొందేలా విధులు నిర్వహించాలి

**తొర్రూరు, మరిపెడ , దంతలపాల్లీ, పెద్ద వంగర పోలీస్ స్టేషన్ లను సందర్శించి తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ చంద్ర మోహన్ గారు**






శుభ తెలంగాణ :ఈ రోజు జిల్లా ఎస్పీ చంద్ర మోహన్ గారు తొర్రూరు, మరిపెడ , దంతలపాల్లీ, పెద్ద వంగర పోలీస్ స్టేషన్ లను సందర్శించి పోలీస్ స్టేషన్ పరిధిలో ను, పరిసరాలను, రికార్డ్స్ ను మరియు సిబ్బంది నిర్వహిస్తున్న విధులను తనిఖీ చేసి పరిశీలించారు.
అందులో భాగంగా పోలీస్ స్టేషన్ అవరణ, రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్ టీమ్, ఎస్ హెచ్ వో, లాక్ అప్, మెన్ రెస్ట్ రూమ్ తదితర ప్రదేశాలను పరిశీలించారు. స్టేషన్ లో రోజు వారీగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ,సెంట్రీ రిలీఫ్ బుక్, డ్యూటీ రోస్టర్, విలేజ్ రోస్టర్, ప్రాసెస్ రిజిస్టర్, బీట్ డ్యూటీ బుక్స్, సస్పెక్ట్ చెక్ రిజిస్టర్, సుపీరియర్ ఆఫీసర్స్ విసిటింగ్ బుక్స్, ఫైనల్ రిపోర్ట్స్ తదితర రికార్డ్స్ ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్లో నమోదయిన గ్రేవ్, నాన్ గ్రేవ్ సిడి ఫైల్స్ ను పరిశీలించి, పెండింగ్లో ఉన్న కేసులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు.

# బిజెపి డోర్నకల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు. గుగులోతు మదన్ లాల్.

శుభ తెలంగాణ ::–డోర్నకల్ నియోజవర్గం అభివృద్ధి కొరకు బీజేపీ డోర్నకల్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం ధరకాస్తు చేసుకున్న బి జె వై ఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోతు మధన్ లాల్.నెల్లికుదురు మండలం రతిరాం తండా కు చెందిన మధన్ లాల్ అక్కడి నుండి ఎంపీటీసీ గా గెలిచారు. కాకతీయ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన మధన్ లాల్ ఏపీ వి పి కార్యకర్త గా ఎన్నో విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొనడం జరిగింది.కాకతీయ యూనివర్సిటీ జి ఎస్ సి నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడం తో పాటు, ఎన్నో విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.గత స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వయంగా ఎమ్మెల్యే శంకర్ నాయక్ సొంత బావ ను ఓడించి జిల్లాలో సంచలనంగా మారడు.మధన్ ను గుర్తించిన బీజేపీ అధిష్టానం బి జె వై ఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గా బాధ్యతలు ఇచ్చి ప్రోత్సహించడం లో ఆ అవకాశాన్ని వినియోగించుకొని ప్రశ్నించే గింతుగా పేరొందాడు.
ముఖ్యంగా యువతలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నారు.ఈ నేపథ్యంలో తనకు డోర్నకల్ నుండి అవకాశం ఇవ్వాలని, పార్టీ గెలుపు కోసమా తనవంతు కృషి చేస్తానని అభ్యర్థిత్వాన్ని సమర్పించుకుంటారు.బీజేపీ అధిష్టానం దృష్టిలో యువకుడు, తెగింపు ఉన్న కార్యకర్తగా మంచి గుర్తింపు ఉంది.ఎమ్మెల్యే శంకర్ నాయక్ ను నేరుగా అనేకమార్లు ఎదుర్కోవడం, తెగించి కొట్లాడటం. జిల్లాలో ఏకైన బీజేపీ ఎంపీటీసీ కావడం.ఉన్నత విద్యావంతుడు అవడం కలిసి వచ్చే అంశాలు.

# అంగన్వాడి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి.....

● ఈనెల 11 నుండి రాష్ట్రవ్యాప్త నిరావదిక సమ్మె
● అంగన్వాడి హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తొర్రూర్ సిడిపిఓ కు వినతి పత్రం.



శుభ తెలంగాణ :అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. శుక్రవారం తొర్రూర్ ఐసిడిఎస్ ఆఫీసులో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ తోరూర్ ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో సిడిపిఓ కు సెప్టెంబర్ 11వ తేదీ సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగింది. అనంతరం యూనియన్ నాయకులు పసుల స్వరూప, లక్ష్మీ నరసమ్మ లు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నారని వారంతా బడుగు బలహీన వర్గాలకు చెందిన మహిళలు కాబట్టి 45 సంవత్సరాలుగా ఐసిడిఎస్సి లో పనిచేస్తూ పేదలకు సేవలు అందిస్తున్న కూడా కనీసం వీరికి వేతనం పెన్షన్ ఈఎస్ఐ ఉద్యోగ చట్టబద్ధ సౌకర్యాలేవి ప్రభుత్వం కల్పించకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మన పక్కనే ఉన్న తమిళనాడు పాండిచ్చేరి రాష్ట్రాల్లో అక్కడ రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారు. మిగతా రాష్ట్రాల్లో హెల్త్ కార్డులు రిటైర్మెంట్ బెనిఫిట్ పెన్షన్ పండగ బోనస్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు కాని తెలంగాణ రాష్ట్రంలో మాత్రం అంగన్వాడీలను గుర్తించకుండా, అంగన్వాడీలతో పెట్టి చాకిరి చేయించుకుంటున్నారని అన్నారు. మిగతా కాంట్రాక్టు ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినట్టుగా అంగన్వాడీలను కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఆగస్టు 25న ఐసిడిఎస్ మంత్రి సత్యవతి రాథోడ్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అతి తక్కువ రిటర్మెంట్స్ బెనిఫిట్స్ నిర్ణయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 17వ తేదీ నుండి తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్నట్టు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శైలజ, సుకన్య మంజుల రేణుక తదితరులు పాల్గొన్నారు.ద

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ధరావత్ సురేష్ నాయక్





శుభ తెలంగాణ : జనగామ జిల్లా కోడకండ్ల మండలం లోని బొడో నికుంటా తండాలో బీఆర్ఎస్ కార్యకర్తల ను కాంగ్రెస్ పార్టీ లోకి పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన కొడకండ్ల మండల పార్టీ అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్,

Edited, Printed, Published & Owned by Sri ChandraShekar.Corporate Office : Rama Krishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India.RNI-TELTEL/2017/72695,Editor :ChandraShekar.Cell :7799911110.Email:subhatelangana@gmail. com